ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శనివారం 11 అక్టోబరు 2025 | 5





దేవదేవంభజే
6

» ఘనంగా ప్రారంభమైన వాడపల్లి బ్రహ్మోత్సవాలు



చుక్కలనంటిన వెండి ధర!

- కిలో రూ. 1,72,000 .. రూ.2 లక్షలవుతుందని అంచనా
- మార్కెట్‌లో పెరిగిన కొనుగోళ్లు.. 9 నెలల్లో రెట్టింపు
- బంగారమూ పరుగే.. 22 క్యారెట్ 1,13,400
- 24 క్యారెట్ 10 గ్రాముల ధర రూ.1,23,710

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

బంగారం, వెండిపై మోజు పెరిగే కొద్దీ వాటి ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. బంగారం ధరలు వినియోగదారులకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. అదే బాటలో వెండి సైతం రికార్డులు సృష్టిస్తోంది. శుక్రవారం మార్కెట్‌లో కిలో వెండి ధర అనూహ్యంగా పెరిగి రూ.1,72,000కు చేరింది. ఈ ఏడాది జనవరిలో వెండి ధర రూ.88,400 మాత్రమే. ఈ తొమ్మిది నెలల పదిరోజుల్లో ఏకంగా రెట్టింపు అయింది. త్వరలో కిలో వెండి రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉన్నట్టు మార్కెట్ వర్గాల అంచనా. రేట్లు రోజుకురోజుకు పెరుగుతుండడంతో వెండి కొనుగోలు చేసేవారి సంఖ్య కూడా పెరిగింది. భవిష్యత్ అవసరాల కోసం ఈ కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇక బంగారం ధరలు ఇప్పటికే చాలావరకు దూసుకెళ్లాయి. బంగారం ఇక సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందని వస్తువుగా మారిపోతుందేమో అనే రీతిలో ధరలు పెరిగిపోయాయి. ఆగస్టు 29న 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.94,700గా ఉంది. రాజమండ్రి మార్కెట్‌లో గురువారం నాటికి 22 క్యారెట్ ధర రూ.1,13,800కు పెరిగింది. శుక్రవారం 400 తగ్గి రూ.1,13,400 వద్ద నిలబడింది. 24 క్యారెట్ బంగారం ధర 1,23,710గా ఉంది. ఈ ఏడాది జనవరి 1 నాటికి 22 క్యారెట్ ధర కేవలం 71,150గా ఉంది. 24 క్యారెట్ బంగారం ధర రూ.78వేలు మాత్రమే. ప్రస్తుత ధరలు ఇంకా పెరుగుతాయనే ఆందోళనతో వెండి కిలో బార్లు, క్వాయిన్లు, బంగారం బిస్కట్ రూపంలోనూ కొందరు కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం.

'రుణం' లేదేమో!

- » ఐదు నెలలుగా నిలిచిపోయిన బీసీ, ఎస్సీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల రుణాలు
- » యూనిట్ల సంఖ్య పెంపు పేరుతో మంజూరైనవి మే నెల నుంచి నిలిపివేత
- » అసలెప్పుడు మంజూరవుతాయో తెలియక లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- » అటు నియోజకవర్గాల్లో సమాధానాలు చెప్పలేక ఎమ్మెల్యేలూ సతమతం
- » ఉమ్మడి జిల్లాలో 2,405 బీసీ కార్పొరేషన్ యూనిట్లకు 32,448 దరఖాస్తులు రాక
- » ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే 2,732 యూనిట్లకు 13,317 దరఖాస్తులు
- » నెలలు గడుస్తున్నా ఉలుకుపలుకూ లేని అధికారుల తీరుతో నిరుద్యోగుల్లో బెంగ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల కింద నిరుద్యోగులకు ఇచ్చే స్వయం ఉపాధి యూనిట్లకు గ్రహణం పట్టింది. అప్పటి సీఎం జగన్ ఆనవాయితీగా వస్తోన్న రుణాల మంజూరు ప్రక్రియను పూర్తిగా నిలిపివేశారు. దీంతో ప్రభుత్వం తరపున స్వయం ఉపాధి పొందే అవకాశం లేక ఎందరో పేదలు నష్టపోయారు. అయితే ప్రభుత్వం మారాక మళ్లీ బీసీ, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు మంచిరోజులు వచ్చాయి. చాలా ఏళ్ల తర్వాత ఆగిపోయిన రుణాలను మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీంతో ఈ ఏడాది ఆరంభంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల పరిధిలో స్వయం ఉపాధి యూనిట్లను ఉమ్మడి జిల్లాకు మంజూరు చేసింది. ఈ యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు అప్పగించింది. నిరుద్యోగులకు లాభదాయకంగా ఉంటే స్వయం ఉపాధి యూనిట్లను అధికారులు గుర్తించి మంజూరుచేయాలని ఆదేశించింది. ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్ ఏర్పాటుకు అయ్యే ఖర్చులో ప్రభుత్వం నలభైశాతం, బ్యాంకు రుణం అరవై శాతం వచ్చేలా చేయాలని అధికారులు నిర్ణయించారు. అందులోభాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ విభాగాల్లో అధికారులు 2,405 రుణ యూనిట్లు మంజూరుచేశారు. ఫ్లవర్ బొకేలు, వర్మీకంపోస్ట్ యూనిట్, వెబ్ సైట్ డెవలప్‌మెంట్, ఎల్ఈడీ బల్బుల అసెంబ్లీ యూనిట్, ప్లంబింగ్, వాటర్ బాటిల్ రీసైక్లింగ్, వాటర్‌రీసైక్లింగ్ యూనిట్లు, ఫిష్ పార్మింగ్, అడ్వంచర్ టూరిజం, సబ్బుల తయారీ, మొబైల్‌కార్ వాష్, బేకరీ, ఫ్లై యాష్ బ్రిక్ యూనిట్, సెరికల్చర్, వెల్డింగ్, బ్యూటీపార్లర్, మెడికల్ ల్యాబ్, మూడు చక్రాల ప్యాసింజర్ ఈ-ఆటో, నాలుగు చక్రాల ఆటో, కారు, గూడ్స్ ట్రక్ ఇలా నచ్చిన వ్యాపారం ఏదైనా చేసుకునేలా దరఖాస్తు నిబంధనలు విధించారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందల్లో ఉన్న యూనిట్లకు వేలల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. బీసీ కార్పొరేషన్ పరిధిలో కాకినాడ జిల్లాకు రూ.39.52కోట్ల విలువైన 1,914 యూనిట్లకు31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147 మంది పోటీపడ్డారు. కాపు కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాలో రూ.28.24కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోనసీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది దరఖాస్తు చేశారు. ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14కోట్ల విలువైన 511యూనిట్లు మంజూరవగా, ఆరు వేల దరఖాస్తులు వచ్చాయి. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లకు 5,497, కోనసీమ జిల్లాకు 1,043యూనిట్లకు 3,265, తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తు చేశారు. అతి కష్టంపై వీటిని పరిశీలించిన అధికారులు ఏప్రిల్‌లో బీసీ కార్పొరేషన్ పరిధిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ రుణానికి ఆమోదం ఇచ్చారు. జాబితాలను బ్యాంకులకు పంపగా చాలావరకు రుణాలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇక యూనిట్లు చేతికి అందడ మే తరువాయి అనుకున్న తరుణంలో మే 8న అమరావతి నుంచి ఉన్నతాధికారులు తక్షణం యూనిట్ల మంజూరును నిలిపివేయాలని నోటి మాట ఆదేశాలు జారీచేశారు. దీంతో కంగుతిన్న లబ్ధిదారులు ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో వీటిని త్వరలో రెట్టింపు చేయనున్నట్లు వివరించారు.



ఉలుకుపలుకూ లేదంతే...

మే8న నిలిపివేసిన స్వయం ఉపాధి యూనిట్లను ఇప్పటికీ అధికారులు ప్రారంభించలేదు. ఒకరకంగా చెప్పాలంటే అయిదునెలల నుంచీ కనీసం వీటిపై సమాధానం కూడా ఇవ్వడం లేదు. దీంతో లబ్ధిదారులు ఈసురోమంటున్నారు. స్వయం ఉపాధి పథకానికి ఎంపికయ్యామని సంతోషిస్తే తీరా చేతికి అందినట్లే అంది చేజారిపోవడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాస్తవానికి లేకలేక మంజూరైన యూనిట్లపై లబ్ధిదారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇవి చేతికి వస్తే ఉపాధి లభిస్తుందని సంతోషపడ్డారు. కానీ అదనపు యూనిట్ల మంజూరు పేరుతో మొత్తం నిలిపివేయడంతో వీరంతా లబోదిబోమంటున్నారు. ఐదు నెలలు దాటిపోయినా అసలు ఇవి మంజూరు చేస్తారా? లేదా? అనేదానిపై జిల్లాల అధికారులకు కూడా సమాచారం లేకపోవడంతో లబ్ధిదారులకు ఏం చెప్పలేకపోతున్నారు. అటు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు సైతం తాజాగా ఈ తలనొప్పి పట్టుకుంది. పథకానికి ఎంపికైన లబ్ధిదారులు, అదనపు యూనిట్ల కోసం చూస్తోన్న నిరుద్యోగులు సైతం ఎమ్మెల్యేలు, వారి అనుచరుల చుట్టూ తిరుగుతున్నారు. ఇవి ఎప్పుడు మంజూరవుతాయో తెలుసు కోవాలంటూ ఒత్తిడి తెస్తుండడంతో ప్రజాప్రతినిధులకు ఏం పాలుపోవడం లేదు. పైగా మంజూరైన యూనిట్లు పెంచాలని ఒత్తిడి తెచ్చింది తామే అయినా చివరకు ఉన్నవీ నెలల తరబడి ఆగిపోవడంతో సమాధానాలు చెప్పలేక గింజుకుంటున్నారు. వాస్తవానికి యూనిట్ల సంఖ్యను అధికారులు పెంచాలనుకుంటే తొలివిడత యూనిట్ల మంజూరు ప్రక్రియను పూర్తిచేసి రెండోదశ ప్రక్రియ ఆ తదుపరి ప్రారంభిస్తే నిరుద్యోగులకు ఏఇబ్బంది ఉండేది కాదు. తీరా పెంపు పేరుతో అసలుకే ఎసరు పడడంతో అంతా తలపట్టుకుంటున్నారు. మరో పక్క ప్రభుత్వం రావడంతో తమ బంధువులకు సైతం ఏదోక ఉపాధి యూనిట్ మంజూరు చేయించుకోవాలని భావించిన పార్టీ నేతలు, క్యాడర్‌కు నిరాశే ఎదురైంది. తాజాగా అయిదు రోజుల కిందట అమరావతిలో సంక్షేమశాఖలపై సమీక్ష జరిగింది. యూనిట్ల పెంపు, మంజూరుపై ఇందులో స్పష్టత వస్తుందని అంతా భావించినా ఈ ప్రస్తావన లేకపోవడంతో ఎప్పుడు మంజూరవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

- » పకడ్బందీగా ధాన్యం సేకరించాలని అధికారులకు జేసీ ఆదేశం
- » అవసరమైన సంచులను సిద్ధంగా ఉంచాలని సూచన

అమలాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ధాన్యం సేకరణను పకడ్బందీగా చేపట్టాలని జేసీ నిషాంతి వివిధశాఖల అధికారులు, రైసు మిల్లర్లను ఆదేశించారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సెంట్రల్‌వేర్ హౌసింగ్ కార్పొరేషన్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, పౌరసరఫరాల అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించి ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు సన్నద్ధత చర్యలపై సమీక్ష నిర్వహించారు. ధాన్యం సేకరణకు చేపట్టాల్సిన చర్యలపై రైసుమిల్లర్లకు దిశానిర్దేశం చేశారు. రైతులకు ధాన్యం సేకరణ విషయంలో ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని, వ్యవసాయ పౌరసరఫరాలశాఖ, రెవెన్యూ శాఖలకు సూచించారు. శాఖల సమన్వయంతోపాటు మిల్లర్ల సహకారంతో ధాన్యం సేకరించాలని ఆదేశించారు. సాగు విస్తీర్ణం ఆధారంగా జిల్లాలో 4లక్షల40వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని స్థానిక వినియోగానికిపోనూ 3లక్షల50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాలశాఖ లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లావ్యాప్తంగా 85లక్షల గోనెసంచులు సిద్ధం చేయాలని సూచించారు. రవాణా వాహనాలకు జీపీఎస్ కోఆర్డినేట్స్‌తో రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలన్నారు. రైతుసేవాకేంద్రాల నుంచి మిల్లలకు చేరే ధాన్యంలో తేమ శాతంలో వ్యత్యాసాలు ఉండకూడదని, రెండుచోట్ల ఒకే రీతిన తేమశాతం కొలిచే యంత్రాలు ఉండాలని ఆదేశించారు. తేమశాతం నిర్ధారణలో సిబ్బంది చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏ గ్రామంలో రోజుకు ఎంత ధాన్యం దిగుబడి వస్తుందనే విషయం గ్రామ, వ్యవసాయ సహాయకులు అవగాహన కలిగి ఉండాలని, కోత కోసే విధానాన్ని రైతుసేవా కేంద్రంలో ముందుగా తెలియచేయాలని, గ్రామసభల ద్వారా వారికి అవగాహన కల్పించాలని, మిల్లలకు తరలించడంలో ఏర్పడే గందరగోళాన్ని నిరోధించాలని, రైతుసేవా కేంద్రం ద్వారా మిల్లుకు ధాన్యం వెళ్తే ట్రక్ షీటు జనరేట్ అవుతుందని, లేనిపక్షంలో మిల్లర్లు ఆ ధాన్యాన్ని అప్‌లోడ్ చేసుకోకపోతే రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని విజ్ఞప్తిచేశారు. జిల్లాలో 151 రైసుమిల్లులు ఉన్నాయని వీటి కెపాసిటీ ఆధారంగా లక్ష్యాలు నిర్ణయిస్తామని ఇప్పటికే మిల్లుల తనిఖీ ప్రక్రియ నిర్వహించి సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించామని జేసీ తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో ప్రభుత్వం కొనుగోలుకు చర్యలు చేపట్టిందని, ఆఫ్‌లైన్‌లోనే అమలాపురం బ్రాంచ్ ఐసీఐసీఐ బ్యాంకు కోడ్‌నెంబరు ద్వారా బ్యాంకు గ్యారంట్రీలు తీసి సమర్పిస్తే బ్యాంకుకు వెళ్లే అవసరం లేకుండా ఆన్‌లైన్ వెరిఫికేషన్‌కు అవకాశం ఉంటుందని జేసీ తెలిపారు. నవంబరు మొదటివారంతో ధాన్యంసేకరణ ప్రారంభం అవుతుందని చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో ధర క్వింటాల్‌కు రూ.69 వరకు పెంచారని, గోనెసంచుల అద్దె కూడా రూ.4.74కు పెంచారని తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ అధికారి ఎ.ఉదయభాస్కర్, మేనేజర్ పి.శ్రీనివాసరావు, ఎఫ్‌సీఐ రీజనల్ మేనేజర్ గంగాధర్, రైసుమిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్షించిన జేసీ నిషాంతి

బాణసంచా తయారీ కేంద్రాల భద్రతపై దృష్టిపెట్టాలి

» ఐజీ అశోక్‌కుమార్

కొత్తపేట,అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ కేంద్రాల నిర్వాహకులు పటిష్ట భద్రతపై దృష్టిపెట్టాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీ అశోక్‌కుమార్ అన్నారు. రాయవరంలో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో శుక్రవారం కొత్తపేట బాణసంచా తయారీకేంద్రాలను ఉమ్మడి బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి తయారీ యూనిట్‌ను ఎస్పీ రాహుల్‌మీనాతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తయారీ విధానం యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత వంటి అంశాలపై సంబంధిత నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. భద్రతా నియమాలను పాటించని నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్ రెవెన్యూ, ఫైర్, లేబర్, ఎలక్ట్రిసిటీ ఐదుశాఖల సమన్వయంతో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్మాగారాల్లో పనిచేసే కార్మికులకు సరైన శిక్షణతోపాటు తగు జాగ్రత్తలు పాటించడంతోపాటు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఒక ప్రమాదం జరిగినప్పుడు పటిష్టమైన ఫైర్‌సేఫ్టీ వ్యవస్థ ఉండాలని, ఇందుకోసం ఒక కార్మికుడ్ని ఈ పనిపై ఉండేలా సిద్ధం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్ఐ జి.సురేంద్ర, ఫైర్ అధికారులు పాల్గొన్నారు.



బాణసంచా తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా

నూతన ఉపాధ్యాయులకు ముగిసిన ముందస్తు శిక్షణ

అల్లవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో 8రోజులపాటు శిక్షణకార్యక్రమం నిర్వహించారు. స్కూల్ అసిస్టెంట్, గణితం, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి 244మంది శిక్షణపొందారు. ఈశిక్షణ నూతన ఉపాధ్యాయులకు బాధ్యతలు పెంచి మెళకువలు నేర్పింది. గతంలో బడిలో చేరిన తర్వాత ఇచ్చే విధానం మారింది. కూటమి పాలన ముందస్తు శిక్షణపై దృష్టిసారించింది. దీంతో ఉపాధ్యాయుల భవితకు భరోసా ఏర్పడింది. జిల్లావిద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ఆధ్వర్యంలో కోర్సు డైరెక్టర్ పి.పల్లయ్యశర్మ, సెంటర్ అబ్జర్వర్ పి.రాంబాబు, ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశరావు ఈనెల 3వతేదీ నుంచి 10 వరకు శిక్షణనిచ్చారు.గణితంలో 64మంది, ఫిజికల్‌సైన్స్‌లో73మంది, బయోలాజికల్ సైన్స్‌లో 107మంది ఉపాధ్యాయులు శిక్షణపొందారు. బోధనా సమయంలో సులువుగా విద్యార్థులకు అర్ధమయ్యే రీతిలో ఎలా బోధించాలనే అంశంపై శిక్షణ పొందారు. ఉపాధ్యాయుల బోధన విద్యార్థి స్థాయికి అనుగుణంగా తరగతి లక్ష్యాలకు అనుగుణంగా బోధించాలని డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీ వివరించారు. డీఎస్సీ 25 ఉపాధ్యాయుల ఇండక్షన్స్ శిక్షణలో సర్టిఫికెట్లు అందజేశారు. ఎంఏకే బీమారావు, జీవీఎస్ సుబ్రహ్మణ్యం, పి.పల్లయ్యశర్మ, ఏఎంవో పి.రాంబాబు, ఎం.శ్రీనివాసవినీల్, జీఎస్‌వీఎస్ నెహ్రూ, ఎంఈవోలు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రామకృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.



ఓడలరేవు బీవీసీ కళాశాలలో శిక్షణార్థులను సత్కరించిన డీఈవో సలీంబాషా

బోగస్ మస్తర్లు అరికట్టడానికి..
ఎన్ఎంఎంఎస్ ఏర్పాటు

- » జిల్లాలో 1,58,133 శ్రామికులకు ఈకేవైసీ పూర్తి
- » రెండో దశలో 880 గోకులాల నిర్మాణమే లక్ష్యం
- » జిల్లాలో 11,084 చెత్త గుంతల ఏర్పాటు పూర్తి
- » డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్

పి.గన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 3,64,000 జాబ్‌కార్డులు ఉన్నాయని, వాటిలో2,36,000 జాబ్‌కార్డులు మాత్రమే పని చేస్తున్నాయని డ్వామా పీడీ మధుసూదన్ తెలిపారు. వారిలో పనిచేసే కుటుంబాలు 1,55,000 జాబ్ కార్డులు మాత్రమేనని ఆయన అన్నారు. పి.గన్నవరంలో శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. బోగస్ మస్తర్లు అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)ను ఏర్పాటు చేసిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి శ్రామికుడికి ఈకేవైసీని చేస్తున్నామన్నారు. ఈ సిస్టమ్ ద్వారా బోగస్ మస్తర్లకు స్వస్తి చెప్పడంతోపాటు క్షేత్రస్థాయిలో శ్రామికులు నిర్వహించే పనుల వద్ద అక్రమాలకు చెక్‌పెట్టవచ్చునని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 2,28,000 శ్రామికులు పనిచేస్తున్నారని, ఇప్పటివరకు 1,58,133 మంది శ్రామికులకు 43 శాతం ఈకేవైసీ పూర్తిచేశామని వివరించారు. ఈనెల 20లోపు మిగిలిన శ్రామికుల ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. జిల్లాలోని 1,05,000 చెత్త గుంతల నిర్మాణమే లక్ష్యం కాగా ఇప్పటివరకు 11,084 గుంతలు పూర్తయ్యాయని చెప్పారు. వాతావరణం అనుకూలించకపోవడంతో చెత్తగుంతల ప్రక్రియ ముందుకు సాగడం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో గోకులాలకు సంబంధించి మొదటి దశ నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. పల్లె పండుగ 2.0లో భాగంగా రెండో దశలో 880 గోకులాలు నిర్మాణాలే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 494 గోకులాలకు మంజూరు ఇచ్చామని, వాటిలో 21షెడ్లు పూర్తి కాగా 29గోకులాలు వివిధదశల్లో నిర్మాణంలో ఉన్నాయని, ప్రజాప్రతినిధుల సహకారంతో అర్హులైన పాడిరైతులను గుర్తిస్తున్నామన్నారు.



జొన్నాడ-మండపేట రోడ్డు మరమ్మతులకు రూ.2.25కోట్ల నిధులు మంజూరు

» నర్సిపూడి-సంధిపూడి రోడ్డు నిర్మాణానికి రూ.3.80కోట్లు

ఆలమూరు,అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన కూటమి ప్రభుత్వం ఆలమూరు మండలంలో రెండు ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. దీనిలో ఆలమూరు మండలం జొన్నాడనుంచి మండపేట వరకు రోడ్డు ఇటీవల గోతులు ఏర్పడి ఇబ్బందికరంగా మారడం, నర్సిపూడినుంచి సంధిపూడి వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఉన్నతాధికారులతో చర్చించి ఎట్టకేలకు నిధులు మంజూరు చేయించారు. జొన్నాడ-మండపేట రోడ్డు మరమ్మతులకు రూ.2.25కోట్లు, నర్సిపూడి-సంధిపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డునిర్మాణానికి రూ.3.80కోట్లు మంజూరు చేయించారని ఆర్‌అండ్‌బీ రామచంద్రపురం డీఈ సూర్యనారాయణ తెలిపారు.ఈరెండు రోడ్లకు సంబంధించిన టెండర్లు ఖరారు కావడంతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వివరించారు.ఇటీవల పడుతున్న వర్షాలకు రోడ్లు గోతులు పడి ప్రయాణం ఇబ్బందికరంగా ఉన్న సమయంలో నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణానికి చర్యలుచేపట్టిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావును ప్రజలు అభినందించారు.



అధ్వానంగా ఉన్న జొన్నాడ-మండపేట రహదారి

మూడో దశ రీసర్వే పకడ్బందీగా చేపట్టండి: జేసీ

అమలాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడోదశ భూముల రీసర్వే ప్రక్రియను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కొత్తపేట, రామచంద్రపురం డివిజన్‌ల పరిధిలోని తహశీల్దార్లు, మండల సర్వేయర్లతో నిర్వహించిన రీసర్వే ప్రక్రియ జాయింట్ ఎల్పీఎం పరిష్కార పురోగతిపై సమీక్షించారు. మూడోదశ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఈ సర్వే ప్రారంభం అయిందని, భవిష్యత్తు తరాల వివాద రహితంగా భూములను అందించాలని సూచించారు. రైతుల షెడ్యూలు ప్రకారం రీసర్వేకు హాజరై సొంత పొలం హద్దులు చూపించి సర్వే చేయించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పారదర్శకంగా రీసర్వేను దశలవారీగా ప్రభుత్వం నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా చేపడుతున్నామని ఆమె పేర్కొన్నారు. భూముల సబ్‌డివిజన్, వ్యక్తిగత హక్కుల ప్రక్రియ, భూయజమానుల దరఖాస్తుల అభీష్టానికి అనుగుణంగా విభజనచేసి ఎటువంటి పెండింగ్‌లు లేకుండా చూడాల్సిందిగా జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఆర్డీవోలు దేవరకొండ అఖిల, పి.శ్రీకర్, తహశీల్దార్లు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు 22 వరకు గడువు పొడిగింపు

అమలాపురం టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించే గడువు ఈనెల 10వతేదీతో ముగిసింది. విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ విద్యామండలి ఈనెల 22వతేదీ వరకు గడువును పొడిగించినట్టు ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి వనుము సోమశేఖరరావు శుక్రవారం తెలిపారు. ఏవిధమైన అపరాధ రుసుము లేకుండా విద్యార్థులు ఫీజులు చెల్లించవచ్చునన్నారు. అనంతరం 30వ తేదీ వరకు రూ.వెయ్యి అపరాధ రుసుంతో ఫీజు చెల్లించే అవకాశాన్ని ఇంటర్మీడియట్ బోర్డు కల్పించిందన్నారు. ఆ తర్వాత ఏవిధమైన గడువు తేదీలు ఉండవని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణల్లో భాగంగా జరుగుతున్న ఓరియంటేషన్ ప్రోగ్రాంలో గణిత అధ్యాపకులకు శుక్రవారం అమలాపురం ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాలలో శిక్షణ నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉపన్యాసకులు బోధనాంశాలపై చర్చించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సూచనలు చేశారు.





ధ్వజ పటం ఎగురవేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకస్వాములు

కోనసీమ తిరుమల వాడపల్లి కాంతులీనింది. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. చందనస్వరూపుడైన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవానికి అంకురార్పణ జరిగింది. ఆలయ ముఖ, వసంత మండపాల్లో ఫల, పుష్ప అలంకరణలు సుగంధ పరిమళాలు వెదజల్లాయి. కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను అలరించారు.

- ఘనంగా ప్రారంభమైన వాడపల్లి వెంకన్న 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు
- ధ్వజారోహణతో అంకురార్పణ చేసిన అర్చకస్వాములు, వేదపండితులు
- తొలి రోజు రాత్రి శేష వాహనంపై భక్తులకు అభయమిచ్చిన శ్రీవారు

దేవదేవం భజే

ఆత్రేయపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన శుక్రవారం ఉదయం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు... స్వస్తివచనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరుణ, దీక్షాధారణ, అకల్మష హోమం, అగ్ని ప్రతిష్ఠాపనలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, వాస్తు పూజ, హోమాలు జరిపారు. వసంత మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ధ్వజారోహణం గావించారు. ధ్వజపటాన్ని మేళతాళాలలో ఊరేగించి దేవతలను ఆహ్వానించారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠించిన గురుడికి ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. వాయిద్య కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. రాత్రి శ్రీవారు పరావాసుదేవ అలంకరణలో శేష వాహనంపై కొలువుదీరి తిరువీధుల్లో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు.



పూజలు చేస్తున్న చైర్మన్ వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు సూర్యచక్రధరరావు దంపతులు





శేష వాహనంపై ఊరేగుతున్న స్వామివారు, హారతి తీసుకుంటున్న భక్తులు

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఏలూరు రేంజ్ ఐజీ, ఎస్పీ



భద్రతా ఏర్పాట్లపై ఈవోతో చర్చిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా పరిశీలించారు. మాడవీధులు, పార్కింగ్ ప్రదేశం, క్యూలైన్ల ఏర్పాట్లను చూసి భద్రతా ఏర్పాట్లపై ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. వేలాది మంది భక్తులు తరలిరానున్న దృష్ట్యా ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు 800 మంది సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము ఉన్నారు.



బయట తిండి... కడుపు మండి



రవికుమార్ ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తాడు. ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే అవకాశం లేకపోవడంతో ఓ హోటల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తాడు. సాయంత్రం ఆఫీసు నుంచి వెళ్తూ వెళ్తూ... నూడిల్స్, ఫ్రైడ్‌రైస్, బజ్జీ మిక్చర్... ఇలా ఏదో ఒకటి బయట ఫుడ్ తిని ఇంటికి చేరతాడు. వారం క్రితం కడుపులో మంట రావడంతో వైద్యులను సంప్రదించాడు. బయట జంక్ ఫుడ్ తినడం వల్ల ఈ సమస్య వచ్చిందని డాక్టర్ చెప్పారు.



- మారుతున్న ఆహారపు అలవాట్లు
- ఉరుకులు, పరుగుల జీవనంలో స్ట్రీట్ ఫుడ్‌పైనే ఆధారం
- రోగాలపాలవుతున్న జనం
- పెరుగుతున్న గ్యాస్ట్రిక్ సమస్యలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)



కిరణ్‌కుమార్‌కు పెళ్లయ్యింది. వీధి వీధి తిరిగి వ్యాపారం చేస్తాడు. ఉదయం ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయటకు వ్యాపారం నిమిత్తం వస్తాడు. రాత్రి ఏడెనిమిది గంటలకు తిరిగి ఇంటికి వెళ్తాడు. అయితే ఈ సమయంలో ఆయన ఆకలిదప్పికలు తీర్చుకునేది పూర్తిగా బయటే. మధ్యాహ్నం ఏదో ఒక హోటల్‌లో భోజనం.. సాయంత్రం స్నాక్స్ తర్వాత ఇంటికి వెళ్లడం.. ఇదే అతడి రోజువారీ తంతు.

వారే కాదు.. ఇలాంటి వారెందరో బయట ఆహారంపైనే ఆధారపడుతున్నారు. లేనిపోని అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. ఉరుకులు, పరుగుల జీవనంతో ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. ముఖ్యంగా ఇటీవలి కాలంలో బయట ఆహారం తినేందుకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇంట్లో వంట చేసే సమయం లేని కొందరు.. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. వారంలో కనీసం రెండు, మూడు రోజులు ఇలా స్ట్రీట్ ఫుడ్‌లపై ఆధారపడుతున్నారు.

ఆహార పదార్థాల విక్రయాలు మొదలు, వంట నూనెల ఉత్పత్తుల నుంచి విక్రయదారుల వరకు ప్రతి ఒక్కరూ ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం కింద లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు పదివేల మందికిపైగా హోటళ్లు, ఫుడ్, బేకరీస్, ఆయిల్ ఉత్పత్తి తదితర వ్యాపారాలు చేస్తున్నారు. వ్యాపారం రూ.కోట్లలో జరుగుతోంది. అయితే వీరిలో ఫుడ్ లైసెన్స్ తీసుకుని వ్యాపారం చేసే వారు చాలా తక్కువ. ఇటీవలి కాలంలో స్ట్రీట్ ఫుడ్ బిజినెస్ విపరీతంగా పెరగడంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పెరిగిపోయాయి. ప్రజలు కూడా బయట ఆహారాన్ని తినేందుకు ఆసక్తి చూపుతుండడంతో వీరి వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతోంది.


హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, బజ్జీల కొట్లు, గోబీ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితర వాటిల్లో కల్తీ నూనెను ఎక్కువగా వినియోగిస్తున్నారు. మల్టీసోర్స్ విజిటబుల్ ఆయిల్స్ (ఎంఎస్‌వీవో), అగ్‌మార్క్ నిబంధనలకు లోబడి నిర్దేశిత పరిమాణంలో నూనెలు కలపాలి. కానీ కొందరు తమ ఇష్టానుసారంగా నూనెలు కల్తీ చేస్తున్నారు. ఆరోగ్యానికి హానికరమైన టేస్టింగ్ సాల్ట్, కాల్షియం కార్బైడ్ తదితర ప్రమాదకరమైన రసాయనాలను వినియోగిస్తున్నారు. ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. అయితే ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారులు, నగరపాలక ఆరోగ్య శాఖాధికారులు చోద్యం చూడడం విశేషం.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం...



పదేపదే కాచిన నూనెతో చేసిన వంటకాలు తింటే తొలుత గ్యాస్ట్రిక్, అల్సర్ తర్వాత క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. కల్తీ చేసిన వాటితో గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయని గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు చెప్తున్నారు. కృత్రిమ రంగులు కలిపిన వాటిని ఎక్కువకాలం తినడం వల్ల మనుషులు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. పిల్లల్లో హైపర్ యాక్టివ్, అలర్జీ లక్షణాలు కనిపిస్తాయి. పురుషుల్లో మూత్ర నాళ ఇన్ఫెక్షన్లతో పాటు జీర్ణకోశ వ్యాధులు, ఉబ్బసం వంటివి తలెత్తుతాయి. సింథటిక్ రంగులు మహిళల విషయంలో రుతు సంబంధ ఇబ్బందులు, మైగ్రేన్ తలనొప్పి, థైరాయిడ్, గర్భకోశ, కిడ్నీ, కాలేయ వ్యాధులకు కారణమవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తాజా పదార్థాలుగా చూపి...



మాంసం, చేపలు, రొయ్యలతో తయారుచేసే నాన్ వెజ్ ఆహారాన్ని రోజుల తరబడి డీప్ ఫ్రిజ్‌లో ఉంచుతున్నారు. వినియోగదారులు కోరినప్పుడు వాటికి మసాలాలు దట్టించి వేడివేడిగా వడ్డిస్తున్నారు. సాస్‌లు, బిర్యానీ, తందూరీ చికెన్లలోనూ కృత్రిమ రంగులు కలుపుతున్నారు. మిఠాయిలు, కేక్‌లు, మసాలాలు, మాంసాహారానికి ఎరుపు రంగు, బంగాళాదుంప చిప్స్, పాప్‌కార్న్ వంటి వాటికి పసుపు రంగు, ఐస్‌క్రీమ్, సూప్‌లు, బఠానీ తదితర వాటికి నీలం, ఆకుపచ్చ రంగులు వాడుతున్నారు. కృత్రిమ రంగులు అద్దడం వల్ల అవి నాణ్యంగా, తాజాగా ఉన్నట్టు కనిపిస్తాయి. రోజుల తరబడి నిల్వ ఉన్న వాటిని తాజా పదార్థాలుగా భ్రమించి ఆరగిస్తున్న వినియోగదారులు రోగాల బారిన పడుతున్నారు.

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి నెలకు సుమారు వెయ్యి మంది వరకు ఓపీ వస్తారు. వారిలో 40 శాతం బయట ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధ వ్యాధుల బారిన పడిన వారే. వీధిలో తిండి తింటే కడుపులో మంట ఖాయమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దాలి

- ఆర్‌జేడీ నాగమణి
- డీఎస్సీ-2025కు ఎంపికైన ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



రాజానగరంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి (ఇన్‌సెట్లో) ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

దివాన్‌చెరువు/కాకినాడ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శారీరక, మానసిక నైతిక వికాసం, విజ్ఞానం అందించి సమగ్ర మూర్తిమత్వం గల పౌరులుగా తీర్చిదిద్దాలని జోన్-2 ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఉద్బోధించారు. నూతన ఉపాధ్యాయులకు వారం రోజుల పాటు నిర్వహించిన ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. రాజానగరం మండలంలో ఆరు కేంద్రాల్లో ఈ శిక్షణా తరగతులు నిర్వహించగా జీఎస్ఎల్ దంత కళాశాలలో జరిగిన ముగింపు వేడుకలకు ఆర్‌జేడీ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలువలు కలిగిన అద్భుతమైన సమాజం నిర్మించేది ఉపాధ్యాయులేనన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన జీఎస్ఎల్ వైద్య సంస్థల అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ మంచి సమాజం నిర్మించడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు. భూపాలపట్నంలోని రైట్ కళాశాలలో జరిగిన ముగింపు సభలో డీఈవో కె.వాసుదేవరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి నుంచి అభ్యసనాఫలితాలను సాధించేందుకు వినూత్నమైన వ్యూహాలతో బోధించాలని సూచించారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఎనిమిది రోజులపాటు బోధనా పద్ధతులు, బోధనా వ్యూహాలు, పాఠ్యప్రణాళికలు నిరంతర సమగ్ర మూల్యాంకనపుస్తకం, ఉపాధ్యాయ కరదీపిక, హోలిస్టిక్ ప్రగతిపత్రం పాఠ్యప్రణాళికలు తదితర నూతన అంశాలపై శిక్షణ ఇచ్చారు. తెలుగు, హిందీ, భౌతిక, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, ఫిజికల్ డైరెక్టర్‌లకు అన్ని అంశాల్లో శిక్షణ ఇచ్చారు. తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ముగింపుసభలో కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న ఎస్జీటీలకు ఆర్ఐఎఫ్‌టీ ఇంజనీరింగ్ కళాశాలలో వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల్లో నియామక ఉత్తర్వులను ఇచ్చామన్నారు. స్కూల్ అసిస్టెంట్, పీఈటీ కేడర్ ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్లు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కేటాయించబడతాయని తెలిపారు. ఉపాధ్యాయుల మెరిట్ ర్యాంకు ఆధారంగా వారు ఎంపిక చేసుకున్న ఆప్షన్లమేరకు పోస్టింగ్ ఆర్డర్లు ఆన్‌లైన్‌లో జనరేట్ అవుతాయన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అన్ని కేడర్ల ఉపాధ్యాయులు నియామక ఉత్తర్వులను లీప్ యాప్‌లో వ్యక్తిగత లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 13న వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాలని సూచించారు. ఇండక్షన్ ట్రైనింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు తదుపరి విడతలో నిర్వహించే శిక్షణకు హాజరై పూర్తిచేసిన తరువాత మాత్రమే వారు పోస్టింగ్ ఆర్డర్లు పొందాల్సి ఉంటుందని డీఈవో రమేష్ పేర్కొన్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏడు కేంద్రాల్లో మెగా డీఎస్సీ 2025 నూతన ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. అయితే ఏడింటిలో ఆరు కేంద్రాలు రాజానగరం మండలంలోనే ఎంపిక చేసి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆరింటికి 1424 మంది నూతన ఉపాధ్యాయులను కేటాయించగా 1415 మంది శిక్షణకు హాజరయ్యారని, 9 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలి

కాకినాడలో కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా



కాకినాడ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని, 8వ వేతన సంఘం సిఫార్సులను పెన్షనర్లందరికీ వర్తింపజేయాలన్న డిమాండ్లతో న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నా కు మద్దతుగా శుక్రవారం కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు ధర్నా చేశారు. ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా చైర్మన్ పి.మహేశ్వరరావు, కన్వీనర్ తురగా సూర్యారావు, ఫైనాన్స్ కార్యదర్శి డీఎల్ఎన్ శాస్త్రి ఆధ్వర్యం వహించారు. ప్రధాన తపాలా కార్యాలయం నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. ఆల్ పెన్షనర్స్ యూనియన్ నా యకులు జీవీ లక్ష్మీనారాయణ, డి.మాణిక్యాలరావు, సీహెచ్ రామారావు, ఎం.కూర్మారావు,ఎన్. త్రినాథరావు, ఎన్.భాస్కరరావు, డేగల వీరభద్ర రావు, యూఎస్ఎన్ రెడ్డి,సురేష్‌రెడ్డి, ఎం.శ్రీరామ్మూర్తి, హుస్సేన్, సుభాన్ పాల్గొన్నారు.

13న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస ఆధ్వర్యంలో ఈ నెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు.వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులు. ఎంపికైన వారికి ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

రేపు ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ


శెట్టిబలిజ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి



సమావేశంలో మాట్లాడుతున్న కుడుపూడి సత్తిబాబు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 12వ తేదీ సాయంత్రం 4గంటలకు రాజమహేంద్రవరం త్యాగరాజ భవన్‌లో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర శెట్టిబలిజ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు తెలిపారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఎంపిక శెట్టిబలిజ విద్యార్థులు 300 మందికి స్కాలర్‌షిప్స్ అందిస్తామన్నారు.576 నుంచి 600 మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు, 551 నుంచి 575 మార్కులు సాధించిన వారికి రూ.5 వేలు, 500 నుం చి 550 మార్కులు సాధించిన వారికి రూ.3,500 స్కాలర్‌షిప్స్ అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, బీసీ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారిలను సత్కరిస్తామన్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు విచ్చేయనున్నట్టు చెప్పారు. స్కాలర్‌షిప్స్ ఇచ్చేందుకు మంత్రి వాసంశెట్టి సుభాష్ సీఎస్ఆర్ ఫండ్స్ రూ.10 లక్షలు ఇప్పించారని కుడుపూడి పేర్కొన్నారు. కాగా స్కాలర్‌షిప్స్ పంపిణీకి మొత్తం 300 మంది విద్యార్థులకు గాను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 120 మంది, మిగిలిన కాకినాడ, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల నుంచి 180 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్టు సమాచారం. సమావేశంలో శ్యామలాంబ దేవస్థానం చైర్మన్ కడియాల వీరభద్రరావు, బుడ్డిగ రాధా, కడలి రామకృష్ణ, శీలం గోవింద్, ముసిని బాబురావు, చింతపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి నన్నయలో ఆహార మహోత్సవం



ఆహార మహోత్సవం బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న ఆహార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ కోరారు. అరటి ఆకులపై వినూత్న రీతిలో సిద్ధం చేసిన ఆహార మహోత్సవం బ్రోచరును ఆమె శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 16న ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా 14,15,16 తేదీల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు, పాల్గొనేందుకు విశ్వవిద్యాలయం ఫుడ్ అండ్ టెక్నాలజీ విభాగాన్ని 86395 50186లో గాని, విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను గాని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య డి.కళ్యాణి, అధ్యాపకులు ఎం.కృష్ణవేణి, కె.సింధుజ తదితరులు పాల్గొన్నారు..

యువతకు ఫర్నిచర్ ఫిట్టింగ్‌లో శిక్షణ!

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా యువతను ప్రోత్సహించేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖ ఫర్నిచర్ ఫిట్టింగ్స్ స్కిల్ కౌన్సిల్, మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రతినిధులు కలెక్టర్ చాంబర్‌లో కలిసారు. ఈ సందర్భంగా ప్రాంతీయ నిరుద్యోగ యువతకు ఫర్నీచర్ ఫిట్టింగ్ శిక్షణ ప్రారంభించేందుకు కలెక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో దక్షిణ ప్రాంత స్కిల్ చాప్టర్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ట్రైనర్ విలాసిని, విశ్వనాథ్ పాల్గొన్నారు.

జేఎన్టీయూకేలో ముగిసిన

హాకథాన్-2025



జేఎన్టీయూకే, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో రెండు రోజులు నిర్వహించిన హాకథాన్-2025 శుక్రవారం ముగిసినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. జేఎన్టీయూకే డైరెక్టరేట్ ఆఫ్ ఇంక్యుబేషన్ సెంటర్(డీఐసీ) సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో 80మంది విద్యార్థులు పాల్గొని విభిన్న రంగాల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రతిపాదించారు. జేఎన్టీయూకే ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ఆవిష్కరణలు దేశ జీడీపీ పెరుగుదలకు, భారత ఉత్పత్తిరంగ అభివృద్ధికి సహకరిస్తాయన్నారు. డీఐసీ డైరెక్టర్ డాక్టర్ ఏ.గోపాలకృష్ణ విద్యార్థుల సాంకేతిక ఆవిష్కరణలకు మద్దతునివ్వడంలో డీఐసీ పాత్రను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, లీలాకుమారి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్

సత్యదేవుడి సన్నిధిలో పలు వసతులకు పాలకమండలి ఛైర్మన్ ఆమోదముద్ర



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఛైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు

అన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు పాలకమండలి ఛైర్మన్ ఐవీ రోహిత్ ఆమోదముద్ర వేశారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రధానంగా రూ.4.72 లక్షలతో ప్రకాష్‌సదన్ కాటేజీ నందు విద్యుత్ సరఫరాకు సంబంధించి మెటీరియల్ కొనుగోలుకు, రూ.6.14 లక్షలతో సత్యదేవుడి తెప్పోత్సవంలో తాత్కాలిక విద్యుత్ అలంకరణలకు, రూ.5.10 లక్షలతో మెయిన్‌క్యాంటీన్‌ను డార్మెటరీగా మార్చి భక్తులకు మౌలిక వసతులు కల్పించేందుకు ఆమోదం తెలిపారు. రూ.6 లక్షలతో ఆగమ పాఠశాల వద్ద విద్యార్థుల వసతికి సంబంధించి మెరుగైన సౌకర్యాల కల్పన, రూ.1.40 లక్షలతో కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవ నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇటీవల నిర్వహించిన వివిధ షాపుల బహిరంగ వేలం లో అధిక మొత్తానికి వచ్చిన టెండర్లను, దేవస్థానంలో వివిధ పనులకు సంబంధించి పనులలో లోయస్ట్‌టెండర్‌కు ఆమోదం లభించింది. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

రత్నగిరిపై ప్రొటోకాల్ వాట్సాప్ మెసేజ్‌లు కుదరవు

ఐదు రోజులు ముందుగా ఇచ్చే సిఫార్సు లేఖలకు ప్రాధాన్యం

అన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్రంగదులు, దర్శనాలు, వ్రతముల నిర్వహణ కోసం ప్రముఖులు అందించే వాట్సాప్ మెసేజ్‌లకు ఇకపై కేటాయింపు నిలుపుదల చేయనున్నట్టు ఈవో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సిఫారస్ లేఖలను 5రోజుల ముందుగా అందజేస్తేనే కేటాయింపు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని.. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించి సహకరించాలని కోరింది.

సత్యదేవుడికి బస్సు విరాళం

ప్రత్యేక పూజల అనంతరం అందించిన ఎస్‌బీఐ ఛైర్మన్

అన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానానికి విచ్చేసే భక్తులకు రవాణా సౌకర్యం కోసం 32 సీట్లు సామర్థ్యం కలిగిన సుమారు రూ.25 లక్షల విలువైన బస్సును విరాళంగా అందజేశారు. ఈ బస్సు తాళాలను ఎస్‌బీఐ ఛైర్మన్ దేవస్థానం ఈవో, ఛైర్మన్‌కు అందజేశారు. ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ పటేల్, హేమంత్‌కుమార్, పంకజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరం ఆలయ ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్‌కు బస్సు అందజేస్తున్న ఎస్‌బీఐ ఛైర్మన్



మంగళగిరిలోని సి.కె.కన్వెన్షన్‌లో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్ వివాహ వేడుకకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పిల్లల మానసిక స్థితిని తల్లిదండ్రులు గుర్తించాలి

కాకినాడ జీజీహెచ్ మానసిక వైద్య నిపుణుడు వరప్రసాద్

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): యుక్త వయసుకు వచ్చిన పిల్లల మానసిక స్థితిని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గుర్తించాలని కాకినాడ జీజీహెచ్ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వానపల్లి వరప్రసాద్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జీజీహెచ్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మానసిక ఆరోగ్య పరిస్థితిపై ఒక ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా నిలదొక్కుకోగలం అనేదానిపై ముందు నుంచీ అవగాహన లేకపోతే ఆత్మహత్యలకు దారితీయవచ్చన్నారు. మానసిక అనారోగ్య లక్షణాలను గమనించిన వెంటనే మానసిక వైద్య నిపుణుడిని కలిసి అవసరమైన చికిత్స తీసుకోవాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్‌శ్రీనివాసన్ మాట్లాడుతూ శారీరక ఆరోగ్య సమస్యల మాదిరిగానే ఒక్కో సారి మానసిక సమస్యలు అత్యవసరంగా రావచ్చన్నారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయవరం బాణసంచా ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు

ఏలూరు రేంజ్ పరిధిలో బాణసంచా తయారీ కేంద్రాలపై ముమ్మర తనిఖీలు : డీఐజీ



రాయవరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఐజీ అశోక్‌కుమార్

రాయవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్ పరిధిలో అన్ని జిల్లాల్లో బాణసంచా తయారీ కేంద్రాలు, హోల్‌సేల్ స్టాక్ పాయింట్లు తాత్కాలిక లైసెన్స్ పొందిన షాపులపై ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రాత్రి తనిఖీ చేసిన సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఈనెల 8న రాయవరం శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన బాణసంచా విస్ఫోటనం ప్రమాదంపై దర్యాప్తు జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఎఫ్ఎస్ఎల్ టీం క్లూస్ వివరాలు సేకరించిందని, ప్రమాదంపై రిపోర్టు రావాల్సి ఉందన్నారు. తాను ఇప్పటికే అమలాపురం, మండపేట తదితర ప్రాంతాల్లో బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేశానన్నారు. ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నప్పటికీ అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఫైర్‌సేఫ్టీ పరికరాలను వినియోగించేందుకు ఆపరేటర్ చేసే వ్యక్తి లేనట్టు గుర్తించినట్టు చెప్పారు. ప్రతి బాణసంచా తయారీ కేంద్రం వద్ద ఫైర్‌సేఫ్టీ మెకానిజం ఉపయోగించేందుకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించేలా ఆయా దుకాణదారులను అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీకి సూచించారు. బాణసంచా కొనుగోలు చేసి వచ్చే సంవత్సరం ఉపయోగించుకోవచ్చునే ఆలోచనతో కొంతమంది ఇంట్లో బాణసంచా నిల్వ ఉంచినా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలు ఇంట్లో గాని, అనుమతులు లేకుండా గాని బాణసంచా నిల్వలు ఉంచరాదన్నారు. ఆయన వెంట ఎస్పీ రాహుల్ మీనా, డీఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సీఐ దొరరాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐ పుల్లారావు, ఎస్ఐ డి.సురేష్ బాబు ఉన్నారు.

జీజీహెచ్ గైనిక్ విభాగంలో యువకుడు హల్‌చల్

ముగ్గురిని గాయపర్చిన వైనం

భయపడిన బాలింతలు

మానసిక రోగి అని తెలిసి

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



యువకుడు దుర్గాప్రసాద్

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ గైనిక్ విభాగంలో గురువారం రాత్రి ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. గతంలో ఎంతోమంది చంటి బిడ్డలను ఎత్తుకుపోయిన ఉదంతాలు జరిగిన నేపథ్యంలో పిల్లలను ఎత్తుకుపోయేందుకు వచ్చాడని అతడి పట్టుకునేందుకు గర్భిణులు, బాలింతల సహాయకులు ప్రయత్నించగా సుమారు ముగ్గురిని పళ్లతో కరిచి గాయపర్చి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. వివరాలిలా ఉన్నాయి. యానాం శివారు కోలంకకు చెందిన 20 ఏళ్ల ఆకుల దుర్గాప్రసాద్ గురువారం రాత్రి గైనిక్ విభాగంలోని బాలింతల వార్డు వద్ద చంటి పిల్లలు ఉన్న చోట అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అక్కడ ఉన్న బాలింతలు వారి సహాయకులకు చెప్పడంతో వారు దుర్గాప్రసాద్‌ను నిలదీశారు. అతడు కంగారుపడి ముగ్గురిని చేతుల జబ్బలపై కరిచి గాయపరిచాడు. ఇంతలో సెక్యూరిటీ సిబ్బంది అక్కడకి చేరుకుని బిత్తర చూపులు చూస్తున్న ఆ యువకుడిని పట్టుకుని జీజీహెచ్ అవుట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు. వారు అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో ఆ యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు. వారి ఇచ్చిన సమాచారం మేరకు దుర్గాప్రసాద్ తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని తమ కుమారుడు మానసిక రోగి అని, కాకినాడలో ఓ ప్రైవేటు సైకియాట్రీ ఆసుపత్రిలో చికిత్స ఇప్పిస్తున్నట్టు ఆధారాలతో పోలీసులకు చూపించడంతో ఆ యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ఉండ్రాజవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో గుండెపోటుతో వ్యక్తి మరణించిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ డి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలంగిలో అమిరిశెట్టి దుర్గాప్రసాద్ (42) శుక్రవారం ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్లిన అనంతరం అక్కడికక్కడే గుండెపోటుతో మరణించాడు. అతడు ప్రైవేటు వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఈ సంఘటన జరిగింది.ఎస్ఐ కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు..

మండలంలోని చివటం రైల్వే గేటు సమీపంలో సెప్టెంబరు 25న తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన గంటా గౌతమ్‌కుమార్ (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గౌతమ్ కుమార్‌ను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తణుకులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గౌతమ్ కుమార్ అప్పుల బాధ భరించలేక పురుగు మందు తాగినట్టు ఎస్ఐ తెలిపారు. అతడికి భార్య, తొమ్మిది నెలల పాప ఉన్నారు. ఎస్ఐ రవికుమార్ పర్యవేక్షణలో ట్రైనీ ఎస్ఐ కె.నవీన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



గంజాయితో పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

గోకవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూటీపై గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్టు కోరుకొండ సీఐ సత్యకిషోర్ తెలిపారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా గోకవరం పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. స్థానిక రాణా సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా స్కూటీపై వచ్చిన ముగ్గురు వ్యక్తులపై అనుమానంతో తనిఖీ చేశామని, వారి వద్ద 11 కిలోల గంజాయిని గుర్తించామన్నారు. గంజాయితో పాటు వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని స్కూటీని సీజ్ చేశామన్నారు. నిందితులు రాజమహేంద్రవరానికి చెందిన చింతల మురారి, సూరి హేమంత్, దూలపల్లి నానిగా గుర్తించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించనున్నట్టు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఒంటరి మహిళను బెదిరించి చోరీ.. పదిమంది అరెస్టు

రూ.16 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విశ్వనాథ్

తణుకు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలోని వారణాసివారి వీధిలో నివాసం ఉంటున్న ఒంటరి మహిళను చంపుతామని బెదిరించి బంగారు ఆభరణాలు అపహరించిన కేసులో పదిమంది నిందితులను శుక్రవారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్ తణుకు పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత నెల 26న ఒంటరిగా నివాసం ఉంటున్న వాకలపూడి కనకదుర్గను అర్ధరాత్రి సమయంలో ముఖానికి మాస్కులు ధరించి వచ్చి ఇంటిలోకి వచ్చి దుండగులు ఆమె చేతులను వెనక్కికట్టి, అరిస్తే చంపుతామని బెదిరించి ఒంటి మీద ఉన్న బంగారు ఆభరణాలు, బీరువాలో ఉన్న ఆభరణాలు సుమారు 70 కాసులతో పాటు రూ.70 వేల నగదును తస్కరించారు. కేసును సీఐ కొండయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. పదిమంది మరికొంత మందితో కలిసి ప్రణాళిక ప్రకారం దోపిడీకి పాల్పడి బంగారం, నగదు దొంగిలించి అందరూ పంచుకున్నట్టు గుర్తించారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన సందీప్ రామశంకర్ ఉపాధ్యాయ, మహమ్మద్ ఇక్బాల్ షేక్, రాజమహేంద్రవరానికి చెందిన మీసాల శ్రీనివాసరావు, నిమ్మకాయల శ్రీకాంత్, దుర్గాపు సత్యనారాయణ, దివ్వల యేసు, బిక్కవోలు మండలం బలభద్రపురానికి చెందిన గొర్రెపూడి వెంకటరమణ, శ్రీకాకుళం చిన్న, కర్రి సాయి, చంద్రారెడ్డిను శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి పది బంగారు గాజులు, చెవి దిద్దులు జత, మాటీలు జత కలిసి 162.25 గ్రాముల బంగారు వస్తువులైన రూ.16లక్షలు విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐలు కె.కొండయ్య, బి.కృష్ణ కుమార్, బి.బి.రవికుమార్, ఎస్ఐలు కె.శ్రీనివాసు, కె.ప్రసాదు, డి.ఆదినారాయణ ఉన్నారు.

32మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు కొట్టివేత

ఆలమూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో 32 మందిపై ఉన్న అభియోగం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ శుక్రవారం రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. ఆలమూరు మండలం గుమ్మిలేరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటులో వచ్చిన వివాదంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో 2017 అక్టోబరులో ఒక వర్గం ఇచ్చిన ఫిర్యాదు మేరకు 38మందిపై అప్పటి ఎస్ఐ ఎం.శేఖర్‌బాబు కేసు నమోదు చేశారు. అలాగే మరో వర్గం ఇచ్చిన ఫిర్యాదుతో పలువురిపై కేసు నమోదు చేశారు. అయితే ఒక కేసులో 6నెలల క్రితమే కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. అయితే 38 మందిలో ఆరుగురు మృతిచెందారు. మిగిలిన 32మందిపై ఉన్న అభియోగం రుజువు కాకపోవడంతో కేసును కొట్టి వేస్తూ శక్రవారం రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి సాయిసునంద తీర్పు చెప్పారు. ఈ కేసులో న్యాయవాదులుగా ఎస్ఎస్.ప్రకాశరావు, నామన సీతారాములు ఉన్నారు.

వెంకన్న ఆలయంలో వెండి ఆభరణాలు చోరీ



పేరవరంలో చోరీ జరిగిన వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆత్రేయపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం వేంకటేశ్వర స్వామి ఆలయంలోకి గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి స్వామివారికి అలంకరించిన వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఆలయ తలుపులను పగలు గొట్టి కిరీటం, అభయహస్తలు, శంఖుచక్రాలు, శఠగోపం చోరీ చేసినట్టు ఆలయ ధర్మకర్త వెంపాటి కృష్ణమూర్తి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు.

యువకుడి మృతి కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రామ్‌కుమార్

సీతానగరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మునికూడలి గ్రామానికి చెందిన మురాల అనిల్ దేవ (22) మృతి కేసులో బొబ్బిల్లంక గ్రామానికి చెందిన కప్పల సతీష్, రాజమహేంద్రవరానికి చెందిన కాలుకురాన వరుణ్ (చిన్ని)లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు... గత నెల 29న అనిల్ దేవ మునికూడలిలోని ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతుడి తల్లి కువైట్ నుంచి వచ్చిన అనంతరం ఈనెల 3న కుటుంబ సభ్యులు సమక్షంలో శవపరీక్ష నిర్వహించారు. కేసు విచారణ అనంతరం సెక్షన్‌లను మార్పు చేశారు. సతీష్, వరుణ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని, నిందితులను జైలుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కేసు విచారణ కొనసాగుతోందని, ఇంకా ఎవరైనా వ్యక్తులు ఉన్నట్టు నిర్ధారణ అయితే వారిని అరెస్ట్ చేస్తామన్నారు.

తాటాకిల్లు దగ్ధం

నల్లజర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామంలో ఊర మహంకాలికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం మహంకాలి ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. వెంటనే బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో గ్రామస్థులు మంటను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో తాడేపల్లిగూడెం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి మురళీ కొండబాబు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50 విలువ చేసే సామగ్రి కాలిపోయినట్టు అధికారులు అంచనా వేశారు.

కారును ఢీకొన్న లారీ

నలుగురికి తీవ్రగాయాలు

ప్రత్తిపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నరేంద్రగిరి కొండ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కత్తిపూడి నుంచి ఎర్రవరం వైపు వెళ్తున్న కారును లారీ ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న బాబ్జీ, సుబ్బారావు, నాగరాజు, ఈశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ గీత వైద్యం అందించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ భూమి అప్పగించాల్సిందే

- కాకినాడ నడిబొడ్డున 17ఎకరాలు ప్రైవేటు పరం
- రూ.510కోట్ల విలువైన భూమి బ్రైట్ టౌన్ కంపెనీకే..
- తక్షణం స్థలాన్ని పిటిషనర్‌కు అప్పగించాలని న్యాయస్థానం ఆదేశాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ నగర నడిబొడ్డున ఉన్న 17ఎకరాల భూమి ప్రైవేటుపరం అయిపోయింది. రూ.510కోట్ల విలువైన ఈ భూమిని పిటిషనర్‌కే అప్పగించాలని కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి తాజాగా తీర్పు నిచ్చారు. కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలకు ఎదురుగా ఉన్న ఈ 17 ఎకరాల భూమి తమదంటే తమదని ఒకపక్క ప్రభుత్వం, మరోపక్క ముంబైకి చెందిన బ్రైట్ టౌన్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 1980నుంచీ న్యాయస్థానంలో పోరాడుతున్నాయి. దీనిపై సుదీర్ఘంగా పలు న్యాయస్థానాల్లో కేసు విచారణ కొనసాగుతూ వచ్చింది. అప్పట్లో కాకినాడ అర్బన్ మండలంలోని రమణయ్యపేట గ్రామం పరిధిలో 134/3 సర్వే నెంబర్‌లో ఉన్న ఈ భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు తమవేనని ప్రభుత్వం వాదిస్తోంది. కానీ ఆ భూమిని పిఠాపురం మహారాజా నుంచి తాను కొనుగోలు చేసినట్లు పిటిషనర్ వాదిస్తూ వస్తున్నారు. దీనికి సంబంధించి న్యాయస్థానాల్లో ఆధారాలతో కూడిన దస్తావేజులను చూపించారు. ఈ భూమి తమదేనని వాదిస్తోన్న అధికారులు సరైన భూరికార్డులు చూపించడంలో విఫలమవుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత ఎట్టకేలకు ఇన్నేళ్ల తర్వాత తాజాగా తీర్పు వెలువరించారు. రికార్డులు, ఇతర ఆధారాలన్నీ పిటిషనర్‌కు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్న న్యాయస్థానం మొత్తం భూమిని బ్రైట్‌టౌన్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అప్పగించాలని ఆదేశించింది. కాగా నగరం నడిబొడ్డున ఉన్న పదిహేడెకరాల స్థలం ఇక్కడ ఎకరా రూ.30కోట్ల వరకు పలుకుతోంది. ఇంతటి విలువైన భూమి విషయంలో సరైన రికార్డులు న్యాయస్థానానికి అధికారులు అందజేయడంలో విఫలమవడంతో ప్రైవేటుపరం అయినట్లయింది. కాగా ఈ భూమిలో కొంత ప్రదేశంలో ప్రధాన రహదారిని ఆనుకుని ప్రభుత్వ బాలుర వసతిగృహమైన ఆనంద నిలయం ఉంది.

సామర్లకోట భీమేశ్వరాలయ ఆదాయం రూ.19.96 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సామర్లకోట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో హుండీల లెక్కింపు ప్రక్రియ శుక్రవారం ఆలయ ఆవరణలో దేవదాయ అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, భక్తసంఘం సభ్యులతో నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండల ఛైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ పాల్గొన్నారు. 21 మార్చి నుంచి 9 అక్టోబరు 2025 వరకూ 199 రోజులకు గాను భక్తులు హుండీలలో వేసిన కానుకల ద్వారా 19,96,390 లభించినట్టు ఈవో నీలకంఠం పేర్కొన్నారు.

కాలినడకన కాశీ యాత్రకు పయనం...

ఐ.పోలవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.మూలపొలానికి చెందిన ఓలేటి దుర్గారావు కాలినడకన కాశీ యాత్రకు బయలు దేరాడు. శుక్రవారం గ్రామంలో ఆర్ఎస్ఎస్ సేవకుడు రెల్లు గంగాధరం ఆధ్వర్యంలో గ్రామస్థులు దుర్గారావును ఆశీర్వదించి కాశీ యాత్రకు పంపించారు. 40రోజుల్లో ఆయన కాశీ చేరుకోనున్నట్టు చెబుతున్నారు. దుర్గారావును పరిసర గ్రామాల ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యుడు ఆకుల సత్తిబాబు పాల్గొన్నారు.



కాలినడకన కాశీ బయలుదేరిన ఓలేటి దుర్గారావును అభినందిస్తున్న ప్రజలు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ
అంబాజీపేట, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి చెక్కులను కూటమి నాయకులు పంపిణీ చేశారు. అంబాజీపేటకు చెందిన అప్పన నాగప్రసాద్‌కు రూ.3,53,490, మాచవరానికి చెందిన అమలాపురపు లక్ష్మీప్రసన్నకు రూ.37,515, గంగలకుర్రుకు చెందిన జల్లి శేఖర్‌రెడ్డికి రూ.86,662 చెక్కులను ఇంటికి వెళ్లి అందజేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతజయంత్యుత్సవాలు
అంతర్వేది,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా కేశవదాసుపాలెంలో వేడుకలు నిర్వహించారు. 1925లో ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు నాయకులు తెలిపారు. జిల్లా సహ కార్యవాహ డి.రామ్మోహన్, ఖండకార్యవాహ పెచ్చెట్టి మురళీ,ఎంపీటీసీ బైరా నాగరాజు పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి పైరుపై ఎండాకు తెగులు

వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


చినకొత్తలంకలో వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ముమ్మిడివరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పైరుపై బ్యాక్టీరియా, ఎండాకు తెగులు, పొటాష్ పోషక లోపం ఉన్నట్టు వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్‌తో కూడిన శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల బృందం చినకొత్తలంకలో శుక్రవారం వరి పొలాలను పరిశీలించారు. అక్కడక్కడా పొటాష్ పోషక లోపం, బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించినట్టు వారు గుర్తించారు. వరి పైరుపై ఆయా లోపాలు కనిపిస్తే రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వారికి సూచించారు.

పొటాష్ పోషక లోపం: వరిలో పొటాష్ లోపం వల్ల ఆకుల అంచులు, చివర్ల నుంచి మాడిపోయినట్టుగా మారి వరి మొక్క ఆకులు పసుపురంగుకు మారిపైరు ఎదుగుదల తగ్గుతుంది.

నివారణ: ఈలోపం నివారణకు రైతులు వరిపైరు పొట్టదశకు దగ్గరగా ఉన్న వరి చేలల్లో పైపాటుగా పది కిలోల యూరియా, 20కిలోల పొటాష్ ఎరువును వేసుకోవాలన్నారు. నీటిలో కరిగే మల్టీకె 10గ్రాములు లీటరు నీటికి కలిపి వరిపైరుపై పిచికారీ చేసుకోవాలి. అవసరమైతే వారం రోజుల తరువాత రెండోసారి పిచికారీ చేసుకోవాలని వారు సూచించారు.

బ్యాక్టీరియా ఎండాకు తెగులు..

ఇటీవల కురుస్తున్న వర్షాలకు అధిక ఉష్ణోగ్రతకు వరిలో ఎండాకు తెగులు ఆశిస్తుంది. ఈతెగులు ముందుగా చేల గట్ల వెంబడి ఉన్న కొబ్బరి చెట్ల నీడలో మొదలై ఆ తరువాత చేను అంతా వ్యాపిస్తుంది. ఎండాకు తెగులు బ్యాక్టీరియా వల్ల సోకుతుంది. సాగునీటి ద్వారా ఒక పొలం నుంచి మరొక పొలానికి వ్యాప్తి చెందుతుంది.

తెగులు నివారణ యాజమాన్య పద్ధతులు..

వరి పొలంలో పాత నీటిని తొలగించి చేను ను ఆరగట్టి కొత్తనీరు పెట్టుకోవాలి. నత్రజని వాడకం తాత్కాలికంగా నిలిపివేయాలి. పొట్ట దశకు దగ్గరలో ఉన్న వరి చేలల్లో యూరేటాఫ్ పొటాష్ ఎకరాకు 20కిలోలు వేసుకోవాలి. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే ప్లాంటోమైసిన్ ఒక గ్రాము, కాపర్ హైడ్రాక్సైడ్ 2.0గ్రాములు లీటరు నీటికి కలిపిపైరుపై పిచికారీ చేసుకోవాలన్నారు.

13నుంచి జిల్లా వ్యాప్తంగా నిరసనలు

• సుప్రీంకోర్టు సీజే గవాయ్‌పై దాడియత్నం ఘటన నేపథ్యంలో..


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు భైరవమూర్తి

అమలాపురంరూరల్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించిన ఘటనపై ఎమ్మార్పీఎస్, అనుబంధశాఖల ఆధ్వర్యంలో ఈనెల13 నుంచి జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టినట్టు జిల్లాశాఖ అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లాశాఖ అత్యవసర కార్యవర్గ సమావేశం శుక్రవారం రోళ్లపాలెంలో నేదునూరి నతానియేలు స్వగృహం వద్ద నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ ఆదేశాల మేరకు చేపట్టే నిరసన కార్యక్రమాలను భైరవమూర్తి వివరించారు.

13న కలెక్టరేట్ వద్ద నిరసన..

13నఅమలాపురంలో కలెక్టరేట్‌వద్ద, 17న జిల్లాలోని మండలాల తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టిన 23న చలో అమరావతి కార్యక్రమం చేపడతామన్నారు. ఆయా నిరసనలను విజయవంతం చేయాలని భైరవమూర్తి పిలుపునిచ్చారు. జిల్లాఅధికార ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ, జిల్లా, ఇతర నాయకులు ఆకుమర్తి భాస్కరరావు, చుట్టుగుళ్ల సత్తిబాబు, సత్తాల దుర్గారావు, యార్లగడ్డ రామకృష్ణ, లంక వరప్రసాద్, తొత్తరమూడి శ్రీను, మందా దుర్గారావు, ఆకుమర్తి ఆశీర్వాదం, చుట్టుగుళ్ల నీలకంఠం, ఈతకోట నాగరాజు పాల్గొన్నారు.

విధులు బహిష్కరణ
ముమ్మిడివరం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ భూషణ్‌రామకృష్ణ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ముమ్మిడివరంలో న్యాయవాదులు శుక్రవారంవిధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుటరిలేదీక్షలు నిర్వహించారు. వినతిపత్రాన్ని తహశీల్దార్ టి.సుభాష్‌కు అందించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, తటవర్తి నాగరాజారావు, ముదే వెంకట్రావు, ఎం.వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, దోనిపాటి ఆంజనేయులు, పీవీ చక్రవర్తి, కాశి సింహాద్రివర్మ, ఎంటీవీ ప్రసాదరావు పాల్గొన్నారు. శిబిరాన్ని ఆర్పీఐ నాయకులు చీకురుమెల్లి శ్రీనివాస్, మెండి కృష్ణబాబు సందర్శించి సంఘీభావం తెలిపారు.

డిప్యూటీ సీఎం పవన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన


కేశనపల్లిలో పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెల17న రాజోలు నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో కేశనపల్లిలో వివిధ ప్రాంతాలను రాజోలు ఎమ్మెల్యే దేవ పరిశీలించారు. పవన్ పర్యటన నేపథ్యంలో ఎన్డీఏ నాయకులు స్థానిక రైతులతో కలిసి ఆయన కేశనపల్లి ప్రాంతాన్ని పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్లను ఉన్నతాధికారులకు సూచించారు. అనంతరం తుఫాన్ షెల్టర్ భవనం వద్ద అధికారులు, రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ ప్రాంతంలో పర్యటించడం శుభపరిణామమన్నారు. శంకరగుప్తం డ్రెయిన్ ముంపు వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవడం నా బాధ్యత అని తెలిపారు. అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మన ప్రాంత అభివృద్ధికి ఉపముఖ్యమంత్రి సహకారం కోరతామన్నారు. పర్యటన విజయవంతానికి అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, యెనుముల నాగు, ముప్పర్తి నాని, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, అడబాల నాని, దొరబాబు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైద్యుల ర్యాలీ
అమలాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానసిక ఆరోగ్యం దినోత్సవం సందర్భంగా అమలాపురం ఏరియా ఆసుపత్రి నుంచి శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. స్థానిక వైద్యాధికారులు, మానసిక వైద్యులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ పీవో డాక్టర్ సుమలత, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, మానసిక వైద్యురాలు డాక్టర్ సౌమ్య, సోషల్‌వర్కర్ బాబి, శ్రీనుబాబు, డిఅడిక్షన్ సెంటర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌తో పాటు పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. ఏరియా ఆసుపత్రి నుంచి నల్లవంతెన వరకు జరిగిన ర్యాలీలో ఆసుపత్రి డెవలెప్మెంట్ కమిటీ సభ్యుడు వలవల శివరావు, ఆవుపాటి గోపాల్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ మధుసూదన్, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించండి
అమలాపురంటౌన్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తుల్ని చేయాలని రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఫ్యాప్టో జిల్లాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలల్లో వివిధ రకాల సమాచారాన్ని సేకరించే యాప్‌ను బహిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఫ్యాప్టో జిల్లా శాఖ చైర్మన్ ఎంటీవీఏఎస్ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి దొరబాబు, కోచైర్మన్ సరిదే సత్యపల్లంరాజు, పెంకే వెంకటేశ్వరరావు, జిల్లాశాఖ సభ్యులు షబ్బీర్‌హుస్సేన్, నాగిరెడ్డి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీం బాషాకు వినతిపత్రం అందించారు.

రాష్ట్రస్థాయిలో స్వర్ణ పతకాలు సాధించాలి


సపక్‌తక్రా రాష్ట్రజట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అమలాపురంరూరల్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించడమే లక్ష్యంగా క్రీడాకారులు ప్రతిభ చాటాలని పలువురు ఆకాంక్షించారు. ఈనెల11,12 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలోని జిల్లా క్రీడా మైదానంలో 29వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల సెపక్‌తక్రా క్రీడా పోటీలు జరగనున్నాయని అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన బాలబాలికల జట్లకు అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల క్రీడా మైదానంలో కోచ్ యాంద్ర గౌతమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపులో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాతబాబు సమకూర్చిన క్రీడాదుస్తులను క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్టీసీ డీఎం చల్లా సత్యనారాయణమూర్తి, డాక్టర్ దీక్షితులు, డాక్టర్ గిరిజాకుమారి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు బాలుర టీమ్ కోచ్‌గా కేతా సతీష్, బాలికల టీమ్ కోచ్‌గా బూల చిరంజీవి, టీమ్ మేనేజర్‌గా జీవీ బాబు వ్యవహరిస్తారని తెలిపారు.

రూ.11.90కోట్ల ఉపాధి పనులు

సిబ్బంది నుంచి రూ.23,500 రికవరీ


రివ్యూ నిర్వహిస్తున్న డ్వామా పీడీ మధుసూదన్

పి.గన్నవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ద్వారా పనిచేసే ప్రతి శ్రామికుడికి రోజుకు రూ.297వేతనం వచ్చే విధంగా చూడాలని డ్వామా పీడీ మధుసూదన్ తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో 2024-25లో నిర్వహించిన ఉపాధీ హామీ పనులకు సంబంధించి నిర్వహించిన 18వ సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. శ్రామికులకు ఈనెల20వతేదీలోపు ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. 2024-25లో 1,085 పనులకు రూ.11,90,03,334 నిధులు ఖర్చు చేశారన్నారు. వాటిలో వేతనాలకు రూ.8,53,03,320, మెటీరియల్‌కు రూ.3,37,00,104 ఖర్చు చేశారన్నారు. దీనికి సంబంధించి గ్రామస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించారని చెప్పారు. అనంతరం గ్రామాల వారీగా రివ్యూలో ఎన్ఆర్ఈజీఎస్‌లో మస్టర్ల తేడాలో రూ.10,800, పంచాయతీరాజ్ సీసీ రోడ్లకు సంబంధించి రూ.12,600 తేడాలు గుర్తించినట్టు ఆయన తెలిపారు.ఈసొమ్మును సిబ్బంది నుంచి వసూలు చేస్తామన్నారు.ఏపీడీ మహేశ్వరరావు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో జి.మల్లికార్జునరావు, ఎస్ఎస్ఏటీ ప్రోగ్రాం మేనే జర్ సునీల్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి సత్యనారాయణ, అంబుడ్స్‌మెన్ అడపా వెంకట శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో జి.ఉమామహేశ్వరరావు, ఎస్ఆర్పీ సింహాద్రి, ఏపీవో లక్ష్మీనారాయణ, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, గుడాల రామారావు, కుసుమ వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం
అల్లవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రులో జక్కా వీరభద్రం షాపులో అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ బి.సంపత్‌కుమార్‌లు దాడిచేసి శుక్రవారం భారీగా బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. బాణసంచా మందు, నల్లమందు, పటాస్ మూటలను స్వాధీనం చేసుకుని సురక్షిత ప్రాంతానికి తరలించారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ మృతి


అయినవిల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కొండుకుదురుకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్ పెట్టా నరేష్ శుక్రవారం మృతిచెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు

‘శాంతిభద్రతల విఘాతానికి వైసీపీ కుట్ర’
రాజోలు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి వైసీపీ కుట్ర చేస్తోందని నాటక అకాడమీ డైరెక్టర్ బందెల పద్మ తీవ్రంగా విమర్శించారు. శివకోటిలో మట్ల గ్రూపులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేఖరులతో మాట్లాడుతూ ఆవైసీపీ నేతలునిప్పు పెట్టి రాష్ట్రంలో అలజడి సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించి రాష్ట్రాన్ని రావణకాష్టం చేయడానికి కుట్ర పన్నారని తెలిపారు. అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు మోకా పార్వతి, ఎంపీటీసీ ఉండ్రు సూర్యారావు, యర్రమిల్లి రవి, ఉండ్రు శ్రీనివాస్, మోకా సత్యనారాయణ, నీతిపూడి శ్రీనివాస్, ఉండ్రు నాగేశ్వరరావు, మానుపాటి కిరణ్, ఉండ్రు అనిల్, చిన్నా పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో లాభాలు
మలికిపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌లో భాగంగా కేశనపల్లి, తూర్పుపాలెంలో టీడీపీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి జి.అమూల్య మాట్లాడుతూ జీఎస్టీ 2.0తో పేద, మధ్య తరగతి వర్గాలకు, వ్యాపారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.

అమలాపురంలో న్యాయవాదుల నిరసన


న్యాయవాదుల నిరసన దృశ్యం

అమలాపురం టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాదిపై చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అధ్యక్షుడు చింతపల్లి అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం మోటారు సైకిల్‌ర్యాలీ చేశారు. అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్ వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గడియార స్తంభం సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి వినతిపత్రం అందించారు. అసోసియేషన్ కోశాధికారి నందెపు చినవెంకటేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు డీబీ లోక్, ఎండీ ఆజామ్, కటికదల సత్యనారాయణ, మాకిరెడ్డి ఆదినారాయణ, కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గవాయ్‌పై దాడి అమానుషం
మామిడికుదురు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై చెప్పు విసరడం అమానుష చర్య అని ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘ మండలశాఖ సమావేశం తీవ్రంగా ఖండించింది. శుక్రవారం జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు మాట్లాడుతూ ఈచర్యకు పాల్పడిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని కోరారు. సాధనాల సత్యనారాయణ, గెడ్డం భాస్కర్, బత్తుల రమేష్‌బాబు, బయ్యా మోహనరావు, భూపతి మనోహర్‌రాజు, మట్టా నాగరాజు, తోట రాజారావు పాల్గొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు
కాట్రేనికోన, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన గ్రామదేవత మావుళ్ళమ్మ ఆలయ సన్నిధిలోఉన్న సిద్ధి వినాయకునికి శుక్రవారం సంకష్టహర చతుర్థి పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, గరిక నీటితో అభిషేకం, అలంకరణ, అష్టోత్తర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆణివిళ్ళ ఫణికాంత్‌శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయ అధ్యక్షుడు ఆణివిళ్ళ సాయిబాబా, రామకృష్ణపరమహంస, గ్రంధి రాంప్రసాద్, గ్రంధి నానాజీ, సంసాని పాండురంగారావు, చెరుకు కృష్ణ, చెరుకు బాపిరాజు, గ్రంధి శ్రీను, తాతపూడి గోపి, మహిళలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి రూ.8లక్షల సామగ్రి బహూకరణ
మలికిపురం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురంలో ఉన్న మేరీమాత వృద్ధుల అనాథ ఆశ్రమానికి కెనరా బ్యాంకు ఎండీ కలిదిండి సత్యనారాయణరాజు రూ.8లక్షలు మంజూరుచేసిన సందర్భంగా కెనరా బ్యాంకు కాకినాడ ఏజీఎం ఆర్.గణేష్ సామగ్రిని వృద్ధాశ్రమానికి అందజేశారు.చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, ఎం.పద్మరాజు, మహ్మద్ అమీన్‌అలీ, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు స్యూసన్ అబ్రహం, అనిత, సర్పంచ్‌లు చెల్లుబోయిన హెలీన పాల్గొన్నారు.

క్రియేటివ్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


అవార్డులు అందుకున్న విద్యార్థినులతో హెచ్ఎం విజయకుమారి తదితరులు

అమలాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆకొండి అంజి ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించారు. పాలగుమ్మి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్రకళా విభాగంలో అవార్డులు అందించినట్టు పాఠశాల హెచ్ఎం గుంట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. బి.డోలాశ్రీదీప్తి జ్ఞానేశ్వరి, పి.శ్రీలక్ష్మిప్రవల్లిక ప్రథమ, ద్వితీయ స్థానాలు, కె.లోక్‌వెంకట్ తృతీయ స్థానం సాధించగా వారికి శిక్షణ ఇచ్చిన పార్టుటైమ్ ఇనస్ట్రక్టర్ ఆర్ట్ ఎడ్యుకేషన్ పోలిశెట్టి నరసింహచంద్రకుమార్‌లను అభినందించారు. పార్టుటైమ్ ఇనస్ట్రక్టర్ చంద్రకుమార్‌కు క్రియేటివ్ టీచర్స్ అవార్డు లభించింది. అదేవిధంగా అమలాపురం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు క్రాఫ్ట్ పోటీల్లో అవార్డులు సాధించినట్టు హెచ్ఎం వి.విజయకుమారి తెలిపారు. తోటరాముడి అక్షిత, వజ్రపు సంజన, నామాడి హారికలు మొదటి మూడుస్థానాలు సాధించి విజేతలుగా నిలిచారు. వీరిని హెచ్ఎంతో పాటు క్రాఫ్ట్ టీచర్ వి.దుర్గాభవానీలను అభినందించారు.

అరుణాచలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం
ముమ్మిడివరం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగరపంచాయతీ పల్లిపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం అపీతకుంచాంబ సమేత శ్రీఅరుణాచలేశ్వరస్వామివారి,అరుణగిరి వాయుప్రతిష్ఠ పూజా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆదిత్యశర్మ బ్రహ్మత్వంలో వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ పెన్మెత్స చిట్టిరాజుదంపతులతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి
ముమ్మిడివరం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):బాలికల సామర్థ్యం, హక్కుల కోసం వివక్ష, హింస వంటి సవాళ్లను అధిగమించడానికి విద్య ఎంతో అవసరమని ముమ్మిడివరం సీడీపీవో ఎం.నిహారిక పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలికలకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, కార్యాలయ పర్యవేక్షకులు జీవీఎస్ఎన్ దేవి, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

భారీ వర్షం
మలికిపురం,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పలు గ్రామాల్లో శుక్రవారం కురిసిన భారీవర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. మలికిపురం సెంటర్‌లో భారీవర్షానికి మోకాలు లోతునీటిలో వాహనదారులు ప్రయాణించారు.

స్వదేశీ వస్తువులు వాడాలి
అల్లవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలు సమైఖ్యంగా పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత పౌర విధులు పాటిస్తూ స్వదేశీ వస్తువులను వాడాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ సంపర్క్ ప్రముఖ్ బులుసు జగదీష్ అన్నారు. అల్లవరం సెంటర్‌లో శుక్రవారం జరిగిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అల్లవరంలో జరిగిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో పలువురు వక్తలు ప్రసంగించారు. జిల్లా ప్రముఖ్ పి.విద్యాసాగర్, ఖండకార్యవాహ పి.రామకృష్ణ, ఆకుల వెంకటేశ్వరరావు, మాకిరెడ్డి సత్తిబాబు, జనసేన నాయకుడు కంకిపాటి వీరబాబు, బీజేపీ నాయకుడు సుంకరసాయి, గూడాల పుల్లయ్యశెట్టి, అంగాని ధనుంజయవర్మ, మేడిద శంకరరావు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


మోరిలో గృహ సందర్శన చేస్తున్న రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో ఇందిర

మలికిపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు పాటుపడాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఇందిర అన్నారు. మోరిలో రాష్ట్రస్థాయి 8వ పోషణా మాసోత్సవాల్లో భాగంగా గర్భిణుల ఇళ్లను సందర్శించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న వంటలు ఏ విధంగా చేసుకోవాలో వివరించారు. పలువురి గర్భిణుల బరువులను పరిశీలించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు తీసుకోవాల్సిన ఆకుకూరలను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.చంద్రకళ, అంగన్‌వాడీ వర్కర్లు కొండా జ్యోతి, కె.శేషవేణి, పి.పద్మావతి పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ
ఐ.పోలవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. అంతర్జాతీయ పోషణ మాసం, అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మురమళ్లలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏలూరి సూర్యనారాయణమూర్తి, రాయపురెడ్డి మాణిక్యాలరావు, పంచాయతీ కార్యదర్శి పంతగడ రవిరాజు, గంజా శ్రీను తదితరులు పాల్గొన్నారు.,

ముగిసిన జాతీయ తపాలా వారోత్సవాలు
అమలాపురంటౌన్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):తపాలాశాఖ ఆధ్వర్యంలో అందించే సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ తపాలా వారోత్సవాల ముగింపులో భాగంగా ఆయన మాట్లాడుతూ ఫర్ పీపుల్ లోకల్ సర్వీస్ గ్లోబల్ రీచ్ అనే నినాదంతో తపాలా వారోత్సవాలు నిర్వహించామని తెలిపారు. శుక్రవారం అమలాపురం పోస్టల్ డివిజన్ వారీగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం, తపాలా ఉద్యోగుల నాయకులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ టెండర్లు రద్దు చేయాలని నిరసన



అంతర్వేది, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): పీపీపీ పద్ధతిలో మమ్మల్ని రోడ్డున పడవేసి మా కడుపులు కొట్టవద్దని మత్స్యకారులు ఆక్రందనలతో అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరులో శుక్రవారం నిరసన చేపట్టారు. ఆర్ఆర్ అనే ప్రైవేటు ఏజెన్సీకి అంతర్వేది మినీఫిషింగ్‌హార్బరు నిర్వహణను అప్పగించడంపై స్థానిక మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ నిరసన చేపట్టారు. ఎట్టి పరిస్థితుల్లోను హార్బరును ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే సహించేది లేదన్నారు. ప్రైవేటుఏజెన్సీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫిషరీస్ లేబర్ సొసైటీనుంచి హార్బరు నిర్మాణానికి 20ఎకరాల భూమి ఇచ్చి ఇప్పుడిప్పుడే అంతా సక్రమంగా జరుగుతూ ఆర్థికంగా ముందుకు వెళ్లే ప్రయత్నంలో మత్స్యకారుల పొట్ట కొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

సిద్ధివినాయకుని ఆలయంలో పూజలు
అయినవిల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఆశ్వయుజమాసం బహుళ చవితి సంకష్టహర చతుర్థి సందర్భంగా శుక్రవారం స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అమలాపురానికి చెందిన కంకటాల వెంకటరత్నం కుటుంబ సభ్యులు సిద్ధివినాయకుని దర్శించుకుని అన్నప్రసాదట్రస్టుకు రూ.10వేలు విరాళం అందజేశారు. లక్ష్మీగణపతి హోమంలో భక్తులు పాల్గొన్నారు. నూతన వాహనాలను భక్తులు స్వామివారి సన్నిధిలో ఉంచి వాహన పూజలు జరిపించుకున్నారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి
రాజోలు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి ఫలితాలు సాధించాలని డీవైఈవో జి.సూర్యప్రకాశం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల వర్క్ పుస్తకాలు, రాత పుస్తకాలు, నిర్మాణాత్మక మూల్యాంకన పుస్తకాలు, ఉపాధ్యాయుల హ్యాండ్ పుస్తకాలను పరిశీలించారు. సోమవారం నుంచి ఎఫ్ఏ2 పరీక్షలు సజావుగా జరిగేటట్టు చూడాలన్నారు. సీఎంవో బి.సుబ్రహ్మణ్యం, రాజోలు ఎంఈవో ఎన్.మనోహరం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టపాసులు తయారు చేస్తే బైండోవర్
పి.గన్నవరం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):బాణసంచా ప్రమాద ఘటనలను దృష్టిలో ఉంచుకుని టపాసుల తయారీని నిలిపివేయాలని సీఐ ఆర్.భీమరాజు హెచ్చరించారు. కె.ముంజవరం శివారు కఠార్లంకలో తహశీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా టపాసుల తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. అనుమానం వచ్చిన వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని సిఐ స్పష్టం చేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ బి.శివకృష్ణ, ఆర్ఐ డాంషే, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



యానాం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): యానాంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారి మిషన్‌శక్తి సంయుక్త ఆధ్వర్యంలో 2కేరన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ హాజరై 2కేరన్‌ను జెండాఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో మగవారితో సమానంగా పోటీ పడుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో ఎక్కువ మంది మహిళా ఉద్యోగులు ఉన్నారన్నారు. పుదుచ్చేరిలో 50శాతానికి మించి మహిళా జనాభా ఉన్నందున, అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35శాతం రిజర్వేషన్ కల్పించేలా జీవో తేవడానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రంగసామిని కోరతానని అన్నారు. 2కేరన్ విజేతలతో పాటు పాల్గొన్న బాలికలందరికీ మల్లాడి నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో యానాం స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి సూరంపుడి రాజేంద్ర, మిషన్‌శక్తి ప్రతినిధి రిపీక తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు 15 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

సీఎంగా 15 ఏళ్లు పూర్తిచేసుకున్న చంద్రబాబు

● వాడపాలెంలో కేక్ కట్ చేసి సంబరాలు

కొత్తపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, సుసాసనం అనే త్రిసూత్రాలతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టిన నాయకుడు చంద్రబాబునాయుడని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం ఆయన వాడపాలెంలో సీఎం చంద్రబాబు 15 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా తన స్వగృహం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి కేక్‌కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు అద్భుత రాజధాని అమరావతి రూపకల్పన, పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయడం వంటి కలలను సహకారం చేయడమే వారి లక్ష్యమని సత్యానందరావు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుల గనిశెట్టి వీరేష్, కంఠంశెట్టి శ్రీనివాస్, మిద్దే ఆదినారాయణ, కడలి భీమా, యల్లమిల్లి జగన్మోహన్, ముద్రగడ ఫణి, యెలిశెట్టి ప్రభాకర్, గుబ్బల మూర్తి, యల్లమిల్లి జగన్మోహన్, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే బండారు



రావులపాలెంలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయంవద్ద శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి 52 వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి సత్వరమే ఆయా అధికారులకు పంపిస్తామన్నా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమమం ధ్యేయంగా పనిచేయడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తుందన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై వినియోగదారులకు అవగాహన

కొత్తపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచనలు మేరకు టీడీపీ శ్రేణులు శుక్రవారం వ్యాపార సంస్థలవద్ద జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపు వినియోగదారులకు అందుతుందా లేదా అనేది వ్యాపారస్తులను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలందరికీ దక్కాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీనివాసరావు, వాసంశెట్టి సత్యనారాయణ, బూసి భాస్కరరావు, యెలిశెట్టి ప్రభాకర్, యల్లమిల్లి జగన్మోహన్, మిద్దే ఆదినారాయణ, దేవపాటి వెంకటేశ్వరరావు, బూసి విష్ణుమూర్తి, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో ప్రయోజనం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి):సోలార్‌విద్యుత్ వినియోగదారులకు ప్రయోజనమని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. శుక్రవారం రామచంద్రపురం పట్టణం చింతపల్లి సూరన్ననగర్‌లో పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా సోలార్ ప్యానల్‌ను ఆయన ప్రారంభించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు

● ఆర్డీవో, డీఎస్పీ, జిల్లా ఫైర్ అధికారి బృందం



రాయవరంలో భవానీఫైర్ వర్క్సను, మండపేటలోని, ద్రాక్షారామలో బాణసంచా తయారీకేంద్రం లైసెన్సు పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల, డీఎస్పీ రఘువీర్

రామచంద్రపురం(ద్రాక్షారామ),అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో బాణసంచాతయారీ కేంద్రాల్లో శుక్రవారం అధికారుల బృందం విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల, డీఎస్పీ రఘువీర్, జిల్లా ఫైర్ అధికారి, జిల్లా కార్మికశాఖాధికారితో కలసి తనిఖీలు చేశారు. డివిజనల్‌లో మందుగుండు సామగ్రి తయారీ లైసెన్సు కలిగిన 7 కేంద్రాలు, అమ్మకం లైసెన్సు కలిగిన 5 యూనిట్లలో తనిఖీలు చేశారు. నిబంధన లు ప్రకారం ఉండాల్సిన పరికరాలు, ఫైర్ ఎక్సింగ్యూషర్, వాటరు నిల్వటాంకులు, ఇసుకబకెట్లు, గాలి వెలుతురు ఉన్నాయా లేదా పరిశీలించినట్లు ఆర్డీవో తెలిపారు. అదేవిధంగా పనిచేసే వారికి జీవితబీమా చేయించాలని, నైపుణ్యం ఉన్నవారిని మాత్రమే కార్మికులుగా నియమించాలని, అగ్నిమాపక య ంత్రాల వాడకాలపై అనుభవం ఉండాలని, 19 ఏళ్లలోపు వారిని పనిలో పెట్టరాదని, పగటివేళల్లో మాత్రమే తయారీ కేంద్రంలో పనిచేయాలని లైసెన్సుదారులకు తెలియజేసినట్లు ఆర్డీవో తెలిపారు. డివిజన్‌లో రాయవరం, మండపేట, రామచంద్రపురం మండలాల్లో మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాల్లో తనిఖీలు చేసినట్లు తెలిపారు.

బాణసంచా తయారీ కేంద్రం తనిఖీ

రాయవరం(ఆంధ్రజ్యోతి): రాయవరం శివారు ప్రాంతంలో ఈనెల 8న శ్రీలక్ష్మి గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో బాణసంచా పేలుడు కారణంగా 8మంది మృత్యువాత పడిన నేపథ్యంలో శుక్రవారం రాయవరంలో భవానీ గ్రాండ్ ఫైర్‌వర్క్స్ బాణసంచా కేంద్రాని అధికారుల బృందం తనిఖీ చేశారు. రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఈ.స్వామి జిల్లా ఫైర్ ఆఫీసర్ పార్థసారధి, రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ తదితరులు భవాని ఫైర్ వర్క్స్‌లో లైసెన్స్ , ఫైర్‌సేఫ్టీ, బాణసంచా తయారీ కేంద్రంలో ఎంత మంది కూలీలు పనిచేస్తున్నారు, స్టాక్ తదితర అంశాలను పరిశీలించారు. సీఐ పి.దొరరాజు, ఎస్ఐ డి.సురేష్ బాబు, లేబర్‌ఆఫీసర్ సత్యవేణి, ఇన్‌చార్జ్ తహసీల్దారు భాస్కర్, రామచంద్రపురం ఫైర్ ఆఫీసర్ కె.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు

● ఆర్డీవో, డీఎస్పీల హెచ్చరిక

మండపేట(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాయవరంలో జరిగిన బాణసంచా పేలుడు నేపథ్యంలో అధికారులు మందుగుండు తయారు చేసే కేంద్రాలు, విక్రయకేంద్రాలపై అధికారులు దాడులు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండపేట పట్టణంలో రామ చంద్రపురం ఆర్డీవో అఖిల, డీఎస్పీ రఘువీర్ కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామలక్ష్మీలు శనివారం బాణసంచా తయారీ కేంద్రాలతో పాటు, విక్రయ కేంద్రాలను తనిఖీలు చేశారు. అధికారుల తనిఖీలతో మందుగుండు తయారు చేసే నిర్వాహకులు తమ దుకాణాలు మూసి వేశారు. దాంతో పట్టణంలో వున్న తయారీ కేంద్రాలను పరిశీలించేందుకు వెళ్లిన అధికారులు అక్కడ నిర్వాహకులు లేకపోవడంతో వెనుతిరిగారు. రామచంద్రపురం డివిజన్‌లో తయారీ కేంద్రాలు 7, విక్రయ కేంద్రాలు 4 లైసెన్స్ కలిగి ఉన్నాయని ఆర్డీవో అఖిల తెలిపారు. అలాగే తయారీకేంద్రాలు లైసెన్స్ ఉన్నప్పటికీ రెన్యూవల్ కాకపోవడంతో ప్రభుత్వ అనుమతి వచ్చిన వెంటనే తయారు చేసుకుంటామని నిర్వాహకులు చెప్పారు. అధికారుల వెంట మండపేట తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, పట్టణ సీ.ఐ సురేష్, స్థానిక అగ్నిమాపక అధికారి హనుమంతరావు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ),(ఆంధ్రజ్యోతి): రాయవరం బాణసంచా కేంద్రంలో విస్ఫోటనంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాయవరంలో గణపతి ఫైర్‌వర్క్స్ కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించడం విషాధకరమన్నారు. ఇప్పటివరకు 8మంది ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రెవెన్యూ, అ గ్నిమాపక, పరిశ్రమలు, కార్మికశాఖలు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించని యజమానులు, తనిఖీల్లో నిర్లక్ష్యం చేసిన అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన హోంమంత్రి అనిత ఇప్పటివరకు ఎటువ ంటి నష్టపరిహారం ప్రకటించకపోవడం విచారకరమన్నారు. శనివారం బాధిత కుటుంబాలను ప్రజాసంఘాల ప్రతినిధులు పరామర్శిస్తామన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, క్షతగాత్రులకు రూ.10 లక్షలు ఆర్థికసాయం అందజేయాలని, గాయపడిన వారికి ప్రభుత్వం ద్వారా అత్యుత్త మ వైద్యం అందించాలని, అన్ని బాణసంచా తయారీ కేంద్రాలను తక్షణం తనిఖీచేసి, భద్రతా ప్రమాణాలపై సమీక్ష చేయాలని ఐఎఫ్ టీ యూ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, పి.డి. ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఏఐకెఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం డిమాండ్ చేశారు.

నేడు రామచంద్రపురంలో జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ),అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురంలో సత్యంవాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధి కార్యాలయంలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటల నుంచి ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ జూనియర్ టెక్నీషియన్స్ నియామకానికి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. 10వతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, ఐటీఐ పాస్‌లేదా ఫెయిల్ అయిన 18 నుంచి 27 ఏళ్ల వయస్సు మధ్యగల మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. జాబ్‌లకు ఎంపికైన వారికి రూ.19200 సీటీసీ జీతం, ఉచిత వసతి, భోజనం, రవాణా కల్పిస్తారన్నారు. తమిళనాడులో హోసూరులో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు ఉపాధి ప్రాజెక్టు డైరెక్టరు రామ్ కుమార్‌ను 9948919949లో సంప్రదించవచ్చని తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలి

కపిలేశ్వరపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉపాధిహామీ కూలీలు ప్రతిఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఎం.రంజిత్‌సింగ్, జేఈ రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాతపూడి, వెదురుమూడి, గ్రామపంచాయతీ కార్యాలయాలవద్ద నిర్వహించిన ఉపాధిహామీ 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో గుర్తించిన ఉపాధిహామీ పనుల వివరాలను ఆయా ఫీల్డ్ అసిస్టెంట్లు పి.మహాలక్ష్మి, బోణం సత్తిబాబు గ్రామసభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఎం.రంజిత్‌సింగ్ మాట్లాడుతూ ఉపాధి పథకంలో జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీలు ప్రతీఒక్కరూ ఫీల్డ్ అసిస్టెంట్ లాగిన్ లో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. తాతపూడిలో 79పనులను, వెదురుమూడిలో 43 పనులను గుర్తించినట్లు తెలిపారు. ఈ పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఏపీవో రంజిత్‌సింగ్ తెలిపారు. ఆయా గ్రా మసభల్లో ఉపసర్పంచ్ చుండ్రు అచ్యుతరామారావు, ఎంపీటీసీ జుత్తుగ వెంకటలక్ష్మి, కొప్పిశెట్టి శ్రీనివాస్, జగ్గంశెట్టి సత్యనారాయణ, కార్యదర్శులు బ్రహ్మాజీరావు, వై.శారద, జేఈ రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు బి.సత్యనారాయణ, పి.సీతామహాలక్ష్మి, మేట్లు ఉపాధికూలీలు, రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములపై విచారణ

ఆలమూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మడికి శివారు చిలకపాడు, పెదపళ్ల గ్రామాలలో గ్రామకంఠం, వక్ఫ్ భూముల సమస్యపై శుక్రవారం పలువురు అధికారుల సమక్షంలో ఈ గ్రామాలలో విచారణ నిర్వహించారు. చిలకలపాడు గ్రామంలో వక్ఫ్ భూముల వివాదం కారణంగా పలు భూముల లావాదేవీలు నిచిపోయాయి. ఈనేపథ్యంలో గ్రామానికి చెందిన పలువురు బాధితులు జిల్లా వక్ఫ్ ఆడిటర్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ షఫీవుల్లా, వక్ఫ్‌బోర్డు అధికారి షేక్ రసూల్‌జానీలను కలసి పూర్తి వివరాలు అందించారు. దీనిపై స్పందించిన వారు శుక్రవారం చిలకలపాడు, పెదపళ్ల వక్ఫ్ భూములపై పూర్తిస్థాయి విచారణ చేశారు. స్థానిక ముస్లిం నాయకులు, రైతులను కలసి వివరాలు సేకరించారు. దీనిపై పూర్తిగా విచారణ చేసి నిర్ణయం చెప్పనున్నట్లు వారు తెలిపారు. తమ భూముల లావాదేవీలు సక్రమంగా జరిగే విధంగా మాకు న్యాయం చేయాలని రైతులు వారికి విజ్ఞప్తి చేశారు.

‘విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి’



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న నాగేశ్వరి

రావులపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ప్రజావ్యవస్థను బలోపేతంచేసి గ్రామీణప్రాంత విద్యార్థులను సైతం అగ్రగామిగా నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని బాలికల పాఠశాలను, హాస్టల్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రూ.17లక్షలతో బాలికల హాస్టల్‌లో చేపట్టబోయే మరమ్మతు పనులను ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన పథక అమలుతీరును వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళ్తుందన్నారు.

విద్యతోనే బాలికాభివృద్ధి సాధ్యం

కపిలేశ్వరపురం, అక్టోబరు 10(ఆంధ్ర జ్యోతి): బాలికలు అన్నిరంగాల్లో పురోభివృద్ధి సాధించాలంటే అది ఒక్క విద్యతోనే సాధ్యపడుతుందని శ్రమ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ బి. నాగేశ్వరి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని వల్లూరు, నల్లూరు, కపిలేశ్వరపురం గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో శ్రమస్వచ్ఛంద సంస్థ, ఐసీడీ ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికల బాల్యవివాహాలు, యుక్తవయస్సులో వచ్చే మార్పులు, బాలల అక్రమ తరలింపు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు, బాలికల విద్య, ఆత్మరక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మహిళా పోలీస్, హెల్త్, అంగన్‌వాడీ టీచర్లు, బాలికలు, శ్రమస్వచ్ఛంద సంస్థ టీం సభ్యులు పాల్గొన్నారు.

పట్టణంలో అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కమిషనర్ రంగారావు

మండపేట, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణ సుందరీకరణ పనుల్లో భాగంగా చేపట్టిన పనులను స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. మండపేట-ఆలమూరు రోడ్డులో జరుగుతున్న స్వాగత ద్వారం రంగులతోపాటు, ఐలవ్‌యు మండపేట పేరిట నిర్మిస్తున్న ప్లాంటెన్ పనులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట కమీషనర్ రంగారావు, మున్సిపల్ ఏఈ పవన్ ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నారు.

అముజూరులో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



భరతమాత, హెగ్డే చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న నాయకులు

కె.గంగవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అముజూరులో శుక్రవారం ఆర్‌ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా జరిగిన సభకు బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు అవసరాల రమణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మరివాడ సూర్యనారాయణ మూర్తి, పుల్లెల రామ్మూర్తి హాజరై ప్రసంగించారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100సంవత్సరాలు అయిన సందర్భంగా ఏడాదిపాటు శతజయంతి ఉత్సవాల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలుత భరతమాత, సంఘం వ్యవస్థాపకుడు హెగ్డేవర్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు అవసరాల రామకృష్ణ, కవులూరి వెంకటకృష్ణ, గుడాల ప్రభాకరరావు, నున్న సత్యనారాయణ, చిట్టూరి రామారావు, సలాది రామకృష్ణ, నేమాని సుబ్బారావు, బుచ్చి రాజు, చంద్రరావు, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక కోసం ఆందోళన



తహసీల్దార్ కార్యాలయంవద్ద ఆందోళన చేస్తున్న అగ్రహారంవాసులు

ద్రాక్షారామ, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం యనమదల శివారు అంబికపల్లి అగ్రహారం గ్రా మస్థులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంవద్ద ఆందోళన చేశారు. తమ గ్రామానికి శ్మశానం కావాలని అధికారులు సత్వరం శ్మశాన వాటికకు స్థలం చూపాలని కోరారు. ఈనెల 3న గ్రామంలో ఒక వ్యక్తి మృతి చెందగా చోడవరం గ్రామశ్మశానవాటికలో ఖననం చేయడానికి ప్రయత్నించిన నేపథ్యంలో చోడవరం వాసులు అడ్డుకున్నారని దీంతో తాము అప్పట్లో ఆందోళన నిర్వహించగా పోలీసు, రెవెన్యూ అధికారులు శవా న్ని ఖననం చేయడానికి ఒప్పించారన్నారు. త్వరలో గ్రామానికి శాశ్వతంగా శ్మశాన వాటికను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. గురువారం అధికారులు కొంత స్థలం కేటాయించారని అయితే కొంతమంది రైతులు అభ్యంతరం తెలుపుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో ఒకరుమరణించారని ఏమి చేయాలో తెలియనిస్థితి నెలకొందన్నారు. తహసీల్దార్ తక్షణం తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. అంబికపల్లి అగ్రహారం గ్రామస్థులు పాల్గొన్నారు.

మంత్రి సబితను కలిసిన జిల్లా చేనేత ప్రతినిధుల బృందం

● మంత్రి దృష్టికి చేనేతకార్మికుల సమస్యలు



మంత్రి సబితకు వినతి పత్రం అందజేస్తున్న సంఘాల ప్రతినిధులు

ద్రాక్షారామ, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చేనేత శాఖా మంత్రి సబితను జిల్లా చేనేతసహకార సంఘాల ప్రతినిధుల బృందం సచివాలయంలో కలిసింది. చేనేత సంఘాల కష్టనష్టాలను మంత్రికి ప్రతినిధులు వివరించారు. కపిలేశ్వరపురం మండలం అంగరలో చేనేత సహకార సంఘ కార్మికులు 13 రోజులుగా చేస్తున్న నిరవధిక నిరాహారదీక్ష గురించి మంత్రికి వివరించారు. చేనేత సహకార సంఘాలకు ఆప్కో నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు రోజుల్లో కొంత సొమ్మును సంఘాలకు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, చేనేత కార్మికులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చినట్లు దొంతంశెట్టి సత్యప్రకాష్ తెలిపారు. మంత్రిని కలసిన బృందంలో లాలయ్య, సుబ్బారావు, బసవయ్య, కుమారస్వామి, అన్నవరం, సత్తిబాబు ఉన్నారు.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత సహకార రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని అంగరలో గణపతి చేనేత సహకార సంఘం గత 13 రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షాశిబిరాన్ని ఆయన సందర్శించి కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతకు ఒక్క రూపాయికూడా కేటాయించకుండా మొండిచేయి చూపిస్తూ చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో చేనేత కార్మికులకు చెల్లించాల్సిన త్రిఫ్టు ఫండ్, యారన్‌సబ్సిడీ, పావళావడ్డీ 30శాతం రిబేటు, 2016 నుంచి 2020 మార్చి వరకు పథకాలకు సంబంధించి రావాల్సిన బకాయిలు సుమారు 203కోట్ల రూపాయలు ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ శ్రేణులు మేడిశెట్టి దుర్గారావు, మండల విప్ పలివెల మధు, ఎంపీటీసీ ఎం.దుర్గారావు, పాలింగి శ్రీనివాస్, తదితరులు దీక్షాశిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం తెలిపారు. చేనేత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా శివదుర్గారావు, సహాయ కార్యదర్శి వాసా గంగాధరరావు, గేరురాజు, పశ్చిమగోదావరిజిల్లా చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద జోగేశ్వరరావు, అధ్యక్షులు చల్లా వీరభద్రుడు, చినవీరభద్రరావు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలపై ఛలో విజయవాడను విజయంతం చేయాలి

● సంఘ నాయకుల పిలుపు



చలో విజయవాడ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

మండపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న కార్మికులు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరు తూ ఈనెల 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నామని రామచంద్రపురం విద్యుత్ ఉద్యోగులు జేఏసీ కన్వీనర్ వి.యు. రాజ్‌కుమార్ అన్నారు. మండపేటలో శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పలు విడతలుగా విద్యుత్ ఉద్యోగ సంఘ నాయకులను ఉన్నతాధికారులు చర్చలకు పిలి చినా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని, అందువల్లనే ఈనెల 15నుంచి సమ్మెకు దిగుతున్నామన్నారు. సంఘం పిలుపుమేరకు దశలవారీగా ఆందోళనకు దిగుతున్నామన్నా రు. తమకు సంబంధించిన 29 సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికే సమ్మె కు సంబంధించి గతనెల 30న సమ్మె నోటీసు అందజేశా మన్నారు. 1999 నుంచి 2024 మధ్య ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులందరికీ పాతపెన్షన్ విధానంను వర్తింప చేయాలని కోరారు. ఈనెల 13న చలో విజయవాడ కార్యక్రమంను తల పెట్టామని దానికి జేఏసీకి సంబంధించి వున్న 24 యూని యన్‌లు పాల్గొంటున్నాయన్నారు.. ముఖ్యంగా ఉద్యోగుల నాలుగు డీఏల పెండింగ్‌లోవున్న వాటిని చెల్లించాలని ప్రభుత్వంను డిమాండ్ చేస్తున్నారు.

ఆకుముడత పురుగుల నివారణకు చర్యలు తీసుకోండి

● ఏవో సద్గురుమూర్తి



పొలంబడిలో సూచనలు చేస్తున్న ఏవో సద్గురుమూర్తి

కె.గంగవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆకుముడత పురు గుతో వరి పంటకు నష్టం కలుగుతుంది. దీని నివారణకు రైతు లు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఏవో సద్గురుమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని కుందూరు గ్రామంలో నిర్వహించిన పొలంబడిలో ఆయన ఆకుముడత పురుగు జీవితచరిత్రను రైతులకు వివరించారు. ఈ పురుగు ఆకులకు గొట్టంమాదిరిగా తయారు చేసుకుని పత్రహరితాన్ని పీల్చేస్తుంది. తద్వారా ఆకులు ఎండి పోయి పంట దిగుబడి పడిపోతుంది. దీని నివారణకు పొలం లో ఒక పక్కనుంచి మరో పక్కకు తాడులేక ముళ్లకంచెను లాగితే పురుగు నేలపై నీటిలో పడిపోతుంది. అప్పుడు ఆ నీటిని తొలగించడం ద్వారా నివారించవచ్చునని చెప్పారు. కాటాఫ్‌హైడ్రోక్లోరిడ్ గుళికలు ఎకరాకు ఎనిమిది కిలో లు వేయాలని సూచించారు. ఎంపీపీ పంపన నాగమణి, సొసైటీ అధ్యక్షుడు జగతా వెంకట రమణ, పంపన సుబ్బారావు, కూటమి నాయకులు కొరిపెల్ల సురేష్, పళ్ల చంటి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శాంతిభద్రతలకు కమిటీ కృషి చేయాలి

కె.గంగవరం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు శాంతి కమిటీ కృషి చేయాలని తహశీల్దార్ శ్రీరామప్రసాద్ అన్నారు. శక్రవారం తహశీల్దార్ కార్యా లయంలో ఆయన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. దీపావళి టపాసులు అక్రమ నిల్వలు, జాతరలలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా శాంతి కమిటీలు కృషి చేయా లని చెప్పారు. ఈ సమావేశంలో పామర్రు పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ సత్యనారాయణ, వీఆర్‌వోలు, ఎన్‌జీవోల సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీరామ ప్రసాద్

టీడీపీలో చేరిన వెంటూరు ఉపసర్పంచ్ కుమార్



ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరిన వెంటూరు ఉపసర్పంచ్ కుమార్

మండపేట, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన పంచాయతీ ఉపసర్పంచ్ ప్రదీప్ కుమార్ గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్లజోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీ కండువాను కప్పి కుమార్‌ను సాదరంగా పార్టీలోకి వేగుళ్ల ఆహ్వానించారు. పార్టీలో చేరిన కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ విధానాలకు ఆకర్షితుడినై పార్టీలో చేరానని చెప్పారు. రాయవరం మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి మాధవరావు, వెంటూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు దేవళ్ల వెంకట్రావు, వేణుగోపాలదొర, మేడిశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

‘క్రీడలతోనే ఆరోగ్యం’



మండపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జరిగిన క్రీడాపోటీల్లో విజేతలైన క్రీడాకారులు

మండపేట, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి క్రీడల్లో రాణించటం ద్వారా ఆరోగ్యంతోపాటు మంచి భవిష్యత్ ఉంటుందని మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో వివిధ రకాలు క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలైన వారికి సరిఫికెట్‌తోపాటు బహుమతులు అందజేశారు. అ ధ్యాపకులు లెఫ్టనెంట్ కమాండర్ డాక్టర్ కెఎస్.ఆర్ఎన్.ఎస్.వి.కిరణ్, వెంకన్న, రాజేష్, వీర్రాజు, చంటి, ఇస్మాయిల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలపై ప్రజల్లో అవగాహన

ఆత్రేయపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా ఆదేశాల మేర కు జనజాగృతి రథంద్వారా ప్రజలలో మాదకద్రవ్యాల నిరోధం, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం ఆత్రేయపురం బస్టాండ్‌వద్ద నేరాలపై పోలీస్‌శాఖ రూపొందించిన ఎల్‌ఈడీ ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.